ఈ తృప్తి చాలు

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
డిసెంబర్ 20, 2015

శాంటాతో సందడే సందడి...



అలీ జాఫర్ - ఆయేషా ఫజల్

జాంటీ రోడ్స్ జంట

మార్క్ జుకర్‌బర్గ్- ప్రిస్కిల్లా

కేట్‌మిడిల్టన్
-ప్రిన్స్ విలియమ్స్

కూతుర్నే కన్నారు

'అమ్మానాన్నా కాబోతున్నాం' అని తెలిసిన మధుర క్షణం నుంచే ఏవేవో ఆలోచనలు చుట్టేస్తాయి దంపతులను. పుట్టబోయేది అమ్మాయా? అబ్బాయా? అబ్బాయైతే బావుండని కొందరు... అమ్మాయైతే చెప్పలేనంత సంతోషమని మరికొందరు ... ఎవరైనా ఫర్వాలేదు. హృదయ పూర్వకంగా ఆహ్వానిస్తామని ఇంకొందరు అనుకుంటారు. ఆశపడతారు. అయితే ఈ ఏడాది అమ్మాయిల సంవత్సరంలాగా వుంది. సెలబ్రెటీలుగా ఒక వెలుగు వెలుగుతున్న కొందరికి ఆడపిల్లల రూపంలో అనంతమైన ఆనందం సొంతమైంది. బాలీవుడ్ దర్శక నిర్మాత ఆదిత్య చోప్రా - రాణీ ముఖర్జీ దంపతులకు ఈ మధ్యే పాప అదీరా పుట్టింది. తమ ఇద్దరి పేర్లు కలిసి వచ్చేలా పాపకా పేరు పెట్టారు. ఒబెరాయ్ వంశం కూడా పాపాయి బోసి నవ్వులతో పులకించి పోతోంది. వివేక్ ఒబెరాయ్ - ప్రియాంక జంట తమ పాపకు అమేయ నిర్వాణ అన్న పేరు పెట్టుకున్నారు. దర్శకుడు మోహిత్ సూరి, నటి ఉదిత గోస్వామి జంటకు తొలి చూలు ఆడపిల్లే పుట్టింది. మొదటిసారిగా తల్లిదండ్రులైన ఈ జంట ... పాపకు ప్రేమతో దేవి అని పేరు పెట్టారు. క్రికెటర్ ధోనీ-సాక్షి జంట సైతం ఆడపిల్లకే జన్మనిచ్చింది. తనను జీవా అని పిలుస్తున్నారు ముద్దుగా. పాకిస్తాన్ గాయక నటుడు అలీ జాఫర్ - ఆయేషా ఫజిల్ దంపతులకు ఇటీవల చిన్నారి దేవత పుట్టింది. దక్షిణాఫ్రికా మాజీ క్రికెటర్ జాంటీ రోడ్స్ జంటకు సైతం అమ్మాయే పుట్టింది. తనకు 'ఇండియా జియాన్నె' అని పేరు పెట్టుకున్నారు. ఫేస్‌బుక్ సిఇఓ మార్క్ జుకర్‌బర్గ్- ప్రిస్కిల్లా చాన్ జంటకు మొదటిసారిగా పాపాయి 'మ్యాక్స్' రూపంలో కొత్త ప్రపంచం పరిచయమైంది. ప్రిన్స్ విలియమ్స్ - కేట్ మిడిల్టన్ దంపతులకు రెండవ సారి బుజ్జి యువరాణి జన్మించింది. నానమ్మ డయానా పేరు కలిసి వచ్చేలా తనను ఛార్లెస్ ఎలిజబెత్ డయానా అని పిల్చుకుంటున్నారు. చెప్పకుంటూ పోతే... ఈ జాబితా పెద్దదే. 'కంటే కూతుర్నే కనాలి' అని ప్రతిజ్ఞ చేసినట్టుగా ఆడపిల్లలను కన్న ఈ జంటలకు అభినందనలు చెప్పాల్సిందే.

రాణీ ముఖర్జీ-ఆదిత్య చోప్రా

మోహిత్ సూరి, ఉదిత గోస్వామి

వివేక్ ఒబెరాయ్ - ప్రియాంక

ధోనీ-సాక్షి

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

స్వర్గం - నరకం

వీటితో ఇప్పుడు మనకేం పని. ఎప్పుడో మరణానంతర విషయం కదా!' అనుకుంటే పొరపాటే. నిజానికవి వున్నాయో! లేవో! ఎవరు చూశారు కనక! కానీ భూలోకంలో మాత్రం ఇవి రెండూ వున్నాయి. వీటిని ప్రత్యక్షంగా వీక్షించాలంటే మాత్రం జబ్బు పడాల్సిందే.

అనారోగ్య పరిస్థితుల్లో ... పైసలు లేని వాళ్ల కాళ్లు కదిలేది సర్కారు దవాఖానా వైపే. పేరుకు ఆసుపత్రే అయినా అది నరకానికి నకలు. ఆసుపత్రి ఆవరణలో దోమలు, కుక్కలు, ఎలుకలు, పందులు, పాములు తిష్ట వేసుకుని ... డొక్కలు ఎండిన రోగుల మీద ఆధారపడి వంశాభివృద్ధి చేసుకుంటూ వుంటాయి. చినుకు పడితే చాలు. పరిసరాలు చెరువుల్లా రూపాంతరం చెందుతాయి. లోపలికి అడుగెట్టిన వారిని దుర్గంధం ధోవతిలా చుట్టేస్తుంది. సిబ్బంది ఛీత్కారాల నడుమ .... సుదీర్ఘ నిరీక్షణ అనంతరం... వైద్యులను దర్శించుకునే మహత్తర అవకాశం ప్రాప్తిస్తుంది. భృకుటి ముడి వేసిన వైద్యులవారు... చిటపటల స్వరంతో... మొక్కుబడి ప్రశ్నల అనంతరం... మందులు, పరీక్షలు రాసేస్తారు. సదరు వైద్య పరీక్షల సౌకర్యం దవాఖానాలో వుంటుందన్న గ్యారెంటీ వుండదు కాక వుండదు. మందులు కూడా వుంటే వుంటాయి. లేకపోతే లేదు. అవే గోలీలు. అవే గొట్టాలు. కర్మకాలి ఆస్పత్రిలోనే ఇన్ పేషెంట్‌గా వుండాల్సి వచ్చిందో! మురికి గోడలు, మరకల మంచాల మీద ... మరల్లాంటి సిబ్బంది నడుమ...దోమ కాట్లను...ఎలుకల కొరుకుళ్లను కాచుకుంటూ... క్షణమొక యుగంలా... అస్పత్రి అనబడే నరకలోక విముక్తి కోసం... కంటికి కానరాని ముక్కోటి దేవతలను మొక్కుకుంటూ గడపటమొక్కటే మిగులుతుంది.

•••

డబ్బున్న బాబులకు రోగం కూడా భోగ వస్తువు అవుతుంది. ఎటూ వారు వెళ్లేది కార్పొరేట్ ఆస్పత్రులకే కనక... ముక్కుతూ మూల్గుతూ ... కారు దిగింది మొదలు అన్నీ రాచమర్యాదలే. ఆస్పత్రి ఆవరణ అద్దంలా మెరిసిపోతుంటుంది. ఎక్కడా చూద్దామన్నా ఒక్క మరక కూడా కనిపించదు. పేరు నమోదు చేసుకునే వారితో మొదలెడితే నర్సులు, వైద్యులు ... వారూ వీరూ అనేముంది! ప్రతి ఒక్కరూ 'మేమున్నది మీ సేవకే' అన్నట్టు చిరునవ్వుతో రోగులను పలుకరిస్తారు. అవసరమున్నా లేకున్నా అన్ని రకాల పరీక్షలూ చేసేస్తారు. అదేమంటే 'మీ మేలు కోరే' అంటారు నవ్వుతూ. ఒకవేళ ఆస్పత్రిలోనే వుండాల్సి వస్తే...డీలక్స్, సూపర్ డీలక్స్ గదులు వుండనే వుంటాయి. ఫ్యాన్లు... ఏసీలు ...రూమ్ వామర్లు...వినోదం కోసం విశాలమైన టీవీలు... గంట గంటకి వచ్చి నగుమోముతో మంచిచెడ్డలు విచారించే సిబ్బందీ... స్వర్గానికి కేరాఫ్ అడ్రస్‌లా వుంటుంది. ఆఖరికి రోగ విముక్తులయ్యాక .... నిర్వాహకులు నవ్వుతూ బరువాటి బిల్లు చేతిలో పెట్టినా... పెద్దగా బాధుండదు. 'డబ్బు పోతే పోయింది. అనుక్షణం అంటిపెట్టుకుని మాబాగా చూశారు' అనుకుంటారు.

•••

కొందరికి స్వర్గం లాంటి ఆస్పత్రులు...మరి కొందరికి నరకం లాంటి దవాఖానాలు...ఎందుకీ వివక్ష? వైద్యుడి ముందు రోగులందరూ ఒక్కటే కదా! ఈ రెండిటినీ కలిపేసి... అందరికీ స్వర్గం లాంటి ఆస్పత్రుల్లో చికిత్స చేయగలిగితే ఎంత బావుండు? బహుశా మన నేతలు అందుకు అంగీకరించరేమో! అధికశాతం కార్పొరేట్ ఆస్పత్రులన్నీ వారివే కనకనా! లోగుట్టు పెద్దలకే ఎరుక మరి!

■

◆ మనలో మాట



టపా

చక్కగా చెప్పారు

ఇందిర వృక్ష మిత్ర అవార్డు అందుకున్న చెట్ల వరసల తిమ్మక్క గురించి తెలియజేసారు. అట్టమీదికథ యురేకా అంటార్కిటికా, అలాగే ఆదర్శం ద్వారా చాలా విషయాలు తెలిశాయి. రేపటి పౌరులుగా ఉండాల్సిన పిల్లలు రోడ్ల మీద రైల్వే కంపార్ట్ మెంట్ల మీద, బస్టాండ్లలో అనాథలుగా తిరుగుతూనే ఉన్నారు. నటుడిగానే కాక...చలన చిత్ర రచయితగా మంచి పేరు తెచ్చుకున్న డా॥ ప్రభాకర్ రెడ్డిగారు 'నిర్మాత అనేవాడు పాడి ఆవు. పచ్చగా బతకనివ్వండి. అందరూ బతకండి' అంటూ చాలా చక్కగా వివరించారు. బాల నేస్తాల్లో రెండు జీవుల శరీర భాగాల జంతువులు గురించి తెలిపినందుకు సంతోషం.

అనుపోజు సంతోషి నాగరాజు,
పూల్‌బాగ్ కాలనీ, విజయనగరం

చదివించిన 'సాథీ'

యురేకా అంటార్కిటికా గురించి చాలా బాగా వివరించారు. నేడు వాతావరణ మార్పులతో అంటార్కిటికా సముద్రం ఎంత మేర వినాశనానికి గురువుతోందో తెలియజేయడం బాగుంది. ఉత్తరాఖండ్, చెన్నై, వరదలు ఇంకా మన కళ్ళ ముందు కదలాడుతూనే ఉన్నాయి. ప్రకృతిని నాశనం చేస్తే ఇలాంటి పరిణామాలను ఎదుర్కోక తప్పదు. వీధి బాలల 'సాథీ' వ్యాసం బాగుంది. వీధి బాలల అగచాట్లు వర్ణనాతీతం. ఆ చిన్నారులను అక్కున చేర్చుకొని వారికి సహాయపడిన ప్రమోద్ గారిని అభినందించాల్సిందే.

మోహన్, మైదుకూరు, కడప

అందమైన మనసు ముఖ్యం

అందమైన మనసు ఉండాలే గాని చూసిన ప్రతిదీ అందంగానే కనుపడుతుంది అని 'మనలో మాట'లో చాలా చక్కగా వివరించారు. అంటార్కిటికాతో మన ముందున్న సవాళ్ళ గురించి చక్కగా వివరించారు. అలాగే మన నాయకులు నూతన రాజధానిని సింగపూర్‌లా తీర్చిదిద్దు తామని గర్వంగా చెప్పుకుంటున్నా మరో పక్క పర్యావరణం గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

రాము, కడప

మరిన్ని పరిశోధనలు..

భూ వాతావరణాన్ని శాసిస్తున్న, మంచు కప్పుకున్న అంటార్కిటికా ఖండంపై జీవ మనుగడ గురించి లోతైన పరిశోధనలు జరపాలి. వాతావరణ స్వభావం, పరిణామం వంటి అనేక అంశాలు ఇందులో ఉన్నాయి. మంచు ఎడారిలో జీవవైవిధ్యం అద్భుతం. శాస్త్ర విజ్ఞానానికి సంబంధించిన అంశాలు ప్రచురిస్తున్న ందుకు పాత్రికేయులకు ధన్యవాదాలు.

తుంపాల శ్రీరామమూర్తి, గాజువాక, విశాఖ

అభినందనీయులు

అంటార్కిటికా మంచు ఖండం వాస్తవాలు వింతగొలిపే విడ్డూరాలు నిర్భ్రాంత పరిచాయి. మైనస్ ఉష్ణోగ్రతల వద్ద వేల మంది సైంటిస్టులు మనగలుగుతున్నారు. చలికి అలవాటు పడటానికి నీటి గుంటల్లో స్నానం చిన్న పిల్లల ఆటలుగా తలపించాయి. పర్యావరణ హితానికి తిమ్మక్క చేస్తున్న కృషి అభినందనీయం. ఔత్సాహికుడు ప్రమోద్ 13 ఏళ్లుగా దేశంలో వివిధ పట్టణాల్ని గాలించి 47 వేల మంది వీధిబాలల్ని వారి వారి తల్లిదండ్రులకు అప్పగించడం మామూలు విషయం కాదు.

టి.సత్యనారాయణ మూర్తి,
మల్కాపురం, విశాఖ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

ఈ సంచికలో....

శాంటాతో సందడే సందడి...

కవర్ స్టోరీ 6

క్రిస్మస్ తాత అనగానే ఎర్రటి దుస్తులు, టోపీ, బాన పొట్ట, మందపాటి తెల్లటి మీసాలు, గెడ్డం, సంచి నిండా క్యాండీలు, బొమ్మల బహుమ తులు గుర్తొచ్చేస్తాయి. రెయిన్‌డీర్‌ల బండిపై ఇంటి చిమ్నీల నుంచి లోపలికి వచ్చి సర్‌ప్రైజ్ గిఫ్ట్‌లు అందించే శాంటా క్లాజ్ ఓ గిఫ్ట్. శాంటా ఎక్కడ ఉంటాడు, ఎప్పుడు కనిపిస్తాడని పిల్లలు ఊపిరాడనివ్వని ప్రశ్నలతో పెద్దల్ని ఆశగా అడుగుతుంటారు. ఈ శాంటా క్లాస్ గురించి పెద్దలకే బోలెడు విషయాలు తెలియవు. శాంటానే కాదు చాలా మంది క్రిస్మస్ తాతయ్యలు ఉన్నారు. పిల్లల్ని సంతోషపెట్టడానికి, అల్లరికి బ్రేకులు వేయడానికి వీరి సాయం తీసుకుంటారు. వారి సంగతులన్నీ ఈ వారం అట్ట మీది కథలో..

స్ఫూర్తి 3
కలం కడుపు నింపింది
స్టార్ 4
యూరప్ నుంచి.. ప్రేమతో..
కార్టూన్ పంచ్ 5
చూద్దామా 10
డయ్యూ బీచ్ పండగ
విశేషం 12
మార్పు కోరే 'వీర్నీ'
సినిమా కబుర్లు 14
ఈ తృప్తి చాలు
వింత లోకం 16
కత్తితో కటింగ్
నవ్వుల్ -పువ్వుల్ 17
కథ 18
కాకి బంగారం
రుచి 21
కేకో కేక
బాల నేస్తాలు 22
అయ్యారే.. సయాలి!
ప్రత్యేకం 24
నవ్వుల బుద్ధోడు

కెరటం -13
నన్ను చూసి
పాప భయపడుతుందనుకున్నా...

యుద్ధం ధ్వంసం చేసింది.. సంఘర్షణ వేల మైళ్లు నడిపించింది.. బతుకు పోరాటం పస్తుల్లో గడిచింది. బాంబుల పొగచూరి, బుల్లెట్ల రంధ్రాలు పడి ధారలు కట్టిన ప్రతి సిరియా శరణార్థి జీవితమిది. అబ్దుల్ హలీం అత్తార్ అందులో ఒకడు. అతడికి కలం ఆకలి తీర్చింది. ఆ ఒక్కడికి ప్రపంచమంతా అండగా నిలిచేలా చేసి ఓ నీడనిచ్చింది.

కలం కడుపు నింపింది

అబ్దుల్ హలీం అత్తార్ ఓ సిరియన్. కానీ పౌరసత్వం లేదు. సైన్యం బాంబు దాడిలో ఇళ్లు కూలిపోతే ప్రాణాలు దక్కాయిలేనని పాలస్తీనా క్యాంపుకు పరిగెట్టాడు. దానిపై ఐసిస్ దాడి చేసి బుగ్గి చేస్తే కట్టుబట్టలతో కుటుంబంతో కలిసి లెబనాన్‌కు కదిలాడు. అబ్దుల్ కన్నా ముందే పది లక్షల మంది ఆ పాటికే ఆ చిన్నదేశంలో చేరిపోయారు. ఇక అతడికి నీడ కష్టమే. ఇద్దరు బిడ్డల తండ్రి ఆ పసివాళ్ల నోటికి ఓ రొట్టె ముక్క తుంచి ఇవ్వగలడా. ఐరాస ఆదుకుంది. కానీ అది ఎన్నాళ్లని, ఎన్ని పూటలని. అందుకే సాయం కోసం చేతులు చాచలేక పెన్నులు అమ్మడం మొదలెట్టాడు. తొమ్మిదేళ్ల కొడుకు అబొదీని క్యాంపులో వదిలి, మూడేళ్ల కూతురు రీమ్‌ను భుజానెక్కించుకుని ఎర్రటి ఎండలో మార్కెట్ వీధుల్లో పెన్నులమ్మేవాడు. ఒక్క పెన్ను కొన్నా రెండు చేతులెత్తి కృతజ్ఞత తెలుపుతున్నాడెందుకోనని లెబనాన్ దేశస్తులకు అర్థం కాలేదు. కానీ ఆ ఒక్క పెన్ను అమ్మకం కొండంత ధైర్యాన్ని, రేపటికై కొత్త ఆశను చిగురింపజేసింది. యుద్ధ గాండ్రింపులు, చావు కేకలు పీడకలల్లా వెంటాడుతున్న అబ్దుల్‌కు ఆ కాస్త పాజిటివిటీ ఎక్కడలేని విశ్వాసాన్ని కలిగించింది. తన కూతురు, కొడుకు ఏమైపోతారో అన్న దిగులు తొలిచేస్తున్నా ఆ కాస్త ప్రోత్సాహం బతుకు పోరాటానికి సన్నద్ధం చేసింది. నెలల తరబడి అలా పెన్నులు అమ్ముతున్న అబ్దుల్‌ను ఎవరూ పట్టించుకోలేదు. అతడి కన్నా దయనీయమైన బతుకుల్ని చూసి చూసి, కన్నీరొలికి స్థానికుల గుండెలు ఎండిపోయాయి. కాళరాత్రుల అంధకారంలో బోరున కురుస్తున్న వర్షంలో అబ్దుల్ ఓ చుక్క.

ఏకధాటిగా కురుస్తున్న ఈ శరణార్థుల కుండపోతలో ఎన్ని జీవితాలు కొట్టుకుపోతున్నాయో ప్రపంచానికి తెలిపేందుకు ఈ ఏడాది వేసవిలో బీరట్ వెళ్లాడు నార్వేకు చెందిన మానవ హక్కుల కార్యకర్త, యుద్ధాలు, సంఘర్షణల్ని కళ్లకు కట్టే కాన్‌ఫ్లిక్ట్ న్యూస్ మూలస్థంభం అయిన గిస్సూర్ సైమానార్సన్. వీధుల్లో తిరుగుతూ అక్కడి శరణార్థుల పరిస్థితిని పరిశీలిస్తున్న ఆయనకు రద్దీ మార్కెట్‌లో స్కూటర్లు, కార్ల మధ్య తచ్చాడుతూ పెన్నులు అమ్మేందుకు కష్టపడుతున్న అబ్దుల్ కనిపించాడు. చాలా మంది అలా అమ్ముతారు ఇందులో ఏముంది అని పక్కన వ్యక్తి అనేలోపు మొబైల్‌తో ఓ ఫొటోను క్లిక్‌మనిపించాడు. వెంటనే ప్రపంచానికి ట్వీట్ చేశాడు. అక్కడ అబ్దుల్ చేతి సంచి తగిలించుకుని పెన్నులు అమ్మడం లేదు. మూడేళ్ల రీమ్‌ను భుజాలపై ఎక్కించుకుని రొప్పుతూ

తిరుగుతున్నాడు. అంతటి ఎండలోను తండ్రిపైనున్నాననే భావనేమో ప్రశాంతంగా ఆ చిన్నారి నిద్రపోతోంది. ఆ కోమలమైన కళ్లు రెప్ప వాల్చితే, తండ్రి కళ్లేమో కణకణలాడుతున్న నిప్పుల్లా మండుతూ, పెన్ను కొనే వారి కోసం ఆశగా వెతుకుతూ కనిపించాయి. అందుకే గిస్సూర్ ఫొటో తీశాడు. అక్కడితో ఆగలేదు. 'బయ్ పెన్స్' (కలాల్ని కొనండి) అంటూ ప్రచారం సాగించి అబ్దుల్ సాయానికి నిధులు సేకరించేందుకు కసరత్తులు మొదలెట్టేశాడు. స్థానికంగా శరణార్థుల సహాయం కోసం పనిచేస్తున్న కారోల్ మాలోఫ్ ద్వారా అబ్దుల్‌ను కలిసి ఫండ్ రైజ్ విషయం చెప్పాడు గిస్సూర్. తొలుత 5 వేల డాలర్లను (సుమారు 3 లక్షలు) సేకరిద్దామను కున్నారు. కానీ ప్రపంచవ్యాప్తంగా వచ్చిన స్పందనతో ఆ మొత్తం కేవలం అరగంటలో వచ్చింది. ఇక ఆపేద్దామనుకునేలోపు అమాంతం మొత్తం పెరిగిపోతోంది. గిస్సూర్ ఇదే సరైన సమయమని రెండు వారాలకు కాలాన్ని పొడిగించాడు. అలా సుమారు కోటి రూపాయల మొత్తం సాయ మందింది. 116 దేశాలకు చెందిన సుమారు 7000 మంది తమ వంతు సాయం చేసి అంత మొత్తాన్ని అందజేశారు. వీటిని బ్యాంక్ అకౌంట్ లేని అబ్దుల్‌కు అందించడం న్యాయపరంగా కష్టమైంది. ఏ దేశ పౌరసత్వం లేకపోవడం అడ్డంకిగా మారింది. గిస్సూర్ చాలా పాట్లు పడి ఆ మొత్తం స్థానికుల ద్వారా, మిగతా వ్యక్తుల ద్వారా దఫదఫాలుగా అబ్దుల్‌కు చేరేలా చేశాడు. తొలిగా అందిన కొద్దిపాటి డబ్బుకే అబ్దుల్ ఏకధాటిగా కన్నీరుపెట్టుకున్నాడు. ఆ తర్వాత వచ్చిన డబ్బులో తనలా చాలా యాతనలు పడ్డ తోటి శరణార్థులకు, మిత్రులకు పంచాడు. సిరియాలోని సన్నిహితులకు పంపాడు. డబ్బు దగ్గర ఉంటే ఖర్చు అయిపోతుందని వెంటనే ఓ చిన్నపాటి బేకరి పెట్టాడు. పాలస్తీనాలో ఉన్నప్పుడు ఓ చాకొలెట్ తయారీ కేంద్రంలో పనిచేశాడు. ఆ అనుభవంతోనే వ్యాపారం పెట్టాడు. వర్కింగ్ క్లాస్ ప్రాంతంలో పెట్టడంతో వాళ్లు ప్రోత్సహించారు. కాస్త నిలదొక్కుకున్నాక ఓ కబాబ్ సెంటర్‌ను, రెస్టారెంట్‌ను కూడా ప్రారంభించాడు. వాటిలో పని వారందరినీ శరణార్థులనే తీసుకున్నాడు. ఇప్పటి వరకు 16 మందికి బతుకుదెరువు అందుతోంది. అన్ని కుటుంబాలు ఆకలితో పడుకోకుండా సత్తువ తెచ్చుకున్నాయి. ఆహార తయారీనే ఎందుకంటే సాటి శరణార్థుల ఆకలి చల్లార్చేందుకు కూడా పనికివస్తుందని. రోజూ చాలామందికి ఉచితంగా తిండి పెడుతున్నాడు. అబ్దుల్ కూతురు రీమ్ ఇప్పుడు బొమ్మలతో ఆడుకుంటోంది. తనకు చాలా ఇష్టమైన టెడ్డీ బేర్ బొమ్మను కౌగిలించుకుని హాయిగా నిద్రపోగలుగుతోంది. అబ్దుల్ కొడుకు అబొది 3 ఏళ్ల తర్వాత మళ్లీ బడి ముఖం చూశాడు.


కబీర్ బేడీ

కబీర్ బేడీ అంతర్జాతీయ నటుడు అని పరిచయం చేయాలా? భారత్ సినీ దిగ్గజం అని పరిచయం చేయాలా అనేది ఒకింత ఆలోచించాల్సిందే. జేమ్స్‌బాండ్ సిరీస్‌లోని ఆక్టోపస్సీలో కమాల్ ఖాన్‌గా హాలీవుడ్ వేదికగా తన కమాల్ చూపించాడు. ఇటాలియన్ టీవీ సిరీస్ సాండోకన్‌లో జీవించి అక్కడి ప్రతి ఇంట వ్యక్తిగా మారిపోయాడు. స్యూట్‌లో చూస్తే హాలీవుడ్ వ్యక్తిగా, మామూలుగా చూస్తే మనోడే అని అనుకుంటారు. అంత వేరియేషన్‌ను కేవలం హావభావాల్లోనే చూపించగలడు. ఈ మధ్య మళ్లీ షారుక్, కాజోల్ జోడీగా వస్తున్న దిల్వాలే చిత్రంలో తన లోతైన, గంభీరమైన కంఠాన్ని, చలాకీ చూపుల్ని తెరకివ్వబోతున్నాడు. అలాగే తనకు విశేషమైన పేరు ప్రఖ్యాతలు తెచ్చిన సాండోకన్ సిరీస్‌ను హిందీలోను, ఇంగ్లిష్‌లోను డబ్ చేసి అందివ్వబోతున్నాడు. వచ్చే ఏడాది రానున్న హృతిక్ రోషన్ అద్భుతం 'మెహెంజోదారో' సినిమాలోను ఓ ప్రముఖ పాత్ర పోషించాడని తెలుస్తోంది. ఆ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో చాలా విషయాలే చెప్పుకొచ్చాడు. ఇప్పటి సినిమా పరిస్థితి గురించి, తన రీ ఎంట్రీ గురించి బోలెడు సంగతుల్ని కుండబద్దలు కొట్టాడు. వాటిలో కొన్ని ముచ్చట్లు మీకోసం...

యూరప్ నుంచి..ప్రేమతో..

- నలభై ఏళ్ల క్రితం నన్ను పాశ్చాత్యానికి పరిచయం చేసి నన్నో స్టార్‌గా నిలబెట్టింది సాండోకన్. ఇప్పటికీ ఆ సిరీస్ రిపీటెడ్‌గా టీవీలో ప్రసారమవుతోంది.
- పాతికేళ్లకు పైగా భారత్‌కు దూరమవడానికి కారణం సాండోకన్ తీర్చిదిద్దిన అంతర్జాతీయ నటుడిగా నా ప్రస్థానమే. అంతటి గొప్ప ప్రాజెక్ట్ అయిన సాండోకన్‌ను డబ్ చేయడానికి ఇక్కడ ఉండాల్సిందే.
- ఆ సిరీస్‌లో నటించేందుకు అవకాశం దాని కథ వల్లే అందివచ్చింది. ఆసియాకు చెందిన రాజ కుమారుడు ఓ సముద్రపు దొంగగా మారతాడు. అతడు ఓ ఇంగ్లిష్ అమ్మాయితో ప్రేమలో పడి ఇబ్బందులు కొని తెచ్చుకుంటాడు. తన ప్రజల కోసం పోరాటం చేస్తాడు. ఇదీ కథాగమనం.
- 150 ఏళ్ల క్రితం రాసిన ఓ ఇటాలియన్ నవల ఆధారంగా ఈ టీవీ సిరీస్‌ను నిర్మించారు. రాకుమారుడి పాత్ర కోసం నటుణ్ని ఎంపిక చేయడానికి ముంబై వచ్చారు. వారనుకున్న దేహం తీరు నాకుండటంతో ఆ అవకాశం దక్కింది. సరిగ్గా ఆ సమయంలోనే, అది కూడా రాజ్ ఖోస్లా చిత్రమైన కచ్చే దాగ్‌లో, గిరీష్ కర్నాడ్ చిత్రం తుగ్లక్ సినిమాల్లో నేను నటించడం అవి టాక్ ఆఫ్ ది టౌన్‌గా మారడంతో ఇటాలియన్ల చూపు నా మీద పడింది.
- అక్కడితో కథ ముగియలేదు. రోమ్‌లో జరిగిన ఆడిషన్స్‌లో పాల్గొన్నాను. కత్తి సాము, గుర్రపు స్వారీ, నా నటనను వారు పరీక్షించారు. అప్పటికీ, 10 నగరాల్లో వారి చేసిన అన్వేషణలో ఎవరిని ఎంచుకుంటారో తెలీదు.
- ఆడిషన్స్‌కు వెళ్లినపుడు యూరోప్ అంత చలిగా ఉంటుందని అనుకోలేదు. అడుగు పెట్టానో లేదో గడ్డకట్టేంత చలి. విచిత్రమేమిటంటే నేను ఓ కోట్ కొనడానికి వెనకాడాల్సి వచ్చింది. ఎందుకంటే అప్పట్లో విదేశీ మారక నిబంధనలు చాలా కఠినంగా ఉండేవి. కేవలం 8 డాలర్లు.. రూపాయల్లో 100 మాత్రమే వెంట తీసుకెళ్లేందుకు కుదిరింది. అక్కడ కొందరు స్నేహితుల వల్ల నెట్టుకొద్దామనుకున్నాను. నా అవస్థ గమనించిన ఆర్ట్ డైరెక్టర్ విట్టోరియో నినో నొవారెసె నన్ను ఓ స్టోర్‌కు వెంటబెట్టుకు వెళ్లి ఓ కోట్ కొనుక్కోమన్నాడు. నా దగ్గర అంత డబ్బు లేదంటే ఆ విషయం తాను చూసుకుం టానని సాయం చేశాడు. క్లియోపాత్రా సినిమాకు గాను ఆస్కార్ అవార్డు వచ్చిన వ్యక్తి ఆయన.
- అమెరికన్లలా వారు ప్లాన్ చేస్తారు, భారతీయుల్లా ఇంప్రవైజ్ చేస్తారు. బౌండ్ స్క్రిప్టులుంటాయి, షెడ్యూల్లు ఉంటాయి కానీ సందర్భం, అవ సరం, పరిస్థితి కొద్దీ ఇంప్రవైజ్ చేస్తారు. యూరో పియన్ క్రూతో ఉంటే మంచి యూరోపియన్ విందు ఆస్వాదించడం గ్యారంటీ.
- కాస్త విభిన్న తరహాలో నటించడాన్ని నేర్చుకోవాల్సి ఉంటుంది. నటనలో విషయాల్ని కాస్త తగ్గి వ్యక్తపరచాలి.
- అంతగా బయట కనిపించకపోయినా డిజిటల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటాను. ట్విట్టర్‌లో బాగా ఫాలో అవుతాను. ఫేస్‌బుక్, వైన్, ఇన్‌స్టాగ్రామ్‌లలోను యాక్టివ్‌గా ఉంటాను. నా ఉద్దేశంలో అవి విప్లవాత్మకమైన కమ్యూ నికేషన్ సాధనాలు.
- భారత్‌కు తిరిగి రావాలని అనుకుంటాను గానీ నా అంతర్జాతీయ కెరీర్ పరంగా అదో పెద్ద చాలెంజ్. ఇంగ్లండ్‌లో ఉండిపోతే అమెరికాలో మర్చి పోతారు. అదీ అడ్డంకి.
- భారత సినిమాలో భారీ మార్పులు వచ్చాయి. ఒకప్పుడు ఎడిటింగ్ కోసం టేబుల్ టాప్స్, స్టెయిన్‌బెక్ ఎడిటింగ్ ప్రక్రియల్ని వాడేవారు. ఫిల్మ్‌ను కత్తిరించి గ్లూతో అతికించేవారు. కానీ ఇప్పుడు అంతా డిజిటలైజ్ అయిపోయింది.
- నేను లింటాస్, ఓగిల్వీలకు యాడ్ మేకింగ్ ఫిల్మ్స్ చేస్తున్నపుడు డిస్పాల్వ్ కోసం చెన్నైలోని ప్రసాద్ ల్యాబ్స్‌కు ఫిల్మ్‌ను పంపేవారు.
- రెండో మార్పు భారీ బడ్జెట్‌లు, స్కేల్‌లు. మూడోది బ్రాండ్ బాలీవుడ్ స్థాయి. నేను విదేశాల్లో మన సినిమాలు చూస్తున్నపుడు హాల్లో చాలా మంది విదేశీ ప్రేక్షకులు ఉండటాన్ని గమనిస్తున్నాను. నేరేటివ్ శైలిలో సాగే మన పాటలు, డ్యాన్సులను అంగీకరించడమే కాకుండా వాటిని బాగా ఆస్వాదిస్తున్నారు. ప్రపంచంలో మన కన్నా గొప్పగా పాటలు, నృత్యాలు మరొకరు చేయలేరు.
- మనకు గొప్ప సంగీతకారులున్నారు. జాతీయ కవులనదగ్గ గీత రచయితలున్నారు. ఆస్కార్ అవార్డులు గెలిచిన కంపోజర్లున్నారు. ఇక మన కొరియోగ్రాఫర్ల గురించి చెప్పుకోవాల్సి వస్తే బ్రాడ్వేలో ప్రదర్శించే వాటికన్నా ఎపుడో చాలా ముందుకెళ్లిపోయారు. ఆట, పాటలో మనం ప్రపంచ చాంపియన్లం. కచ్చితంగా ఈ విష యాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి.
- వీక్షకులు, థియేటర్ల పరంగా చూసుకుంటే భారీ డిమాండ్ ఉంది. అమెరికాలో 40 వేల థియేటర్లు ఉంటే, భారత్‌లో 9-10 వేల మధ్య ఉన్నాయి. ఇప్పుడు గేమ్ పూర్తిగా మారిపోయింది. ✦


బీరుకాయల్ బీరుకాయల్
ఇక కొత్త మద్యం పాలసీ

1వ స్థానం
చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదోయ్!!
మానవాభివృద్ధిలో భారత్‌ది 130వ స్థానం

?!


జగన్
రాష్ట్ర పాలనపై గవర్నర్‌కి లేఖ

కార్టూన్ పంచ్

క్రిస్మస్ తాత అనగానే ఎర్రటి దుస్తులు, టోపీ, బాన పొట్ట, మందపాటి తెల్లటి మీసాలు, గెడ్డం, సంచి నిండా క్యాండీలు, బొమ్మల బహుమతులు గుర్తొచ్చేస్తాయి. రెయిన్‌డీర్‌ల బండిపై ఇంటి చిమ్నీల నుంచి లోపలికి వచ్చి సర్‌ప్రైజ్ గిఫ్ట్‌లు అందించే శాంటా క్లాజ్ ఓ గిఫ్ట్. శాంటా ఎక్కడ ఉంటాడు, ఎప్పుడు కనిపిస్తాడని పిల్లల ఊపిరాడనివ్వని ప్రశ్నలతో పెద్దల్ని ఆశగా అడుగుతుంటారు. ఈ శాంటా క్లాస్ గురించి పెద్దలకే బోలెడు విషయాలు తెలియవు. శాంటానే కాదు చాలా మంది క్రిస్మస్ తాతయ్యలు ఉన్నారు. పిల్లల్ని సంతోషపెట్టడానికి, అల్లరికి బ్రేకులు వేయడానికి వీరి సాయం తీసుకుంటారు. వారి సంగతులన్నీ ఈ వారం అట్ట మీది కథలో..

శాంటాతో సందడే సందడి...

- అజయ్ కుమార్ వారాల
9502395077

క్రిస్మస్ ముందు రాత్రి పిల్లలకు చాలా ఫేవరెట్. పండుగ నాటి ఉత్సాహం, సందడి అంతా ఓ రోజు ముందు నుంచే పీక్స్‌లోకి వెళ్లిపోతుంది. క్రిస్మస్ చెట్టును చక్కగా అలంకరించుకుని, నక్షత్రాలు, లైటింగ్ గట్రా పెట్టేసి పెద్దోళ్లు 'వావ్' అనేలోపు ఇంట్లో ఉన్న బుడ్డోళ్లు రయ్యిన లగెత్తుకు వచ్చేసి ఏదో ఒక తుంటరి పని చేస్తారు. వారిని అదుపులో పెట్టడానికి నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఇక ఆ ఎమర్జెన్సీ టైంలో పెద్దల్ని బయటపడేసేందుకు క్రిస్మస్ తాతయ్య సాయం వచ్చేస్తాడు. అల్లరి చేయకుండా, బుద్ధిగా మసులుకుంటే బోలెడు బహుమతులు ఇస్తాడని క్రిస్మస్ చెట్టుకు సాక్స్‌లను తగిలిస్తారు. ఓ వైపు 'హ్యాపీ క్రిస్మస్' చెబుతూనే మరో వైపు ఆ సాక్స్‌ల్ని వెతికేస్తుంటారు చిన్నారులు. వారికి నచ్చింది ఉంటే ఇళ్లు అదిరిపడేలా కేరింతలు, చప్పట్లే. అంత సంతోషాన్ని అమాంతం ఓ చిట్టి సాక్స్‌లో పట్టించే క్రిస్మస్ తాతయ్య ముచ్చట, సందడి అంతా ఇంతా కాదు. చాలా గమ్మత్తుగా ఉంటాయి శాంటా క్లాస్ సంగతులు. ఆ కథా కమామీషు ఇదే.

సెయింట్ నికొలసే..

శాంటా క్లాస్ కథ తెలియాలంటే క్రీస్తు శకం మూడో శతాబ్దానికి వెళ్లాల్సిందే. ఇప్పటి టర్కీ ఒకప్పటి బైజాంటైన్ సామ్రాజ్యం లైసియాలోని మైరా (డెమ్రె)కు చెందిన గ్రీకు బిషప్ సెయింట్ నికొలస్‌కు మంచి పేరుంది. ఆయన ప్రేరణతో రెండు వందల ఏళ్ల క్రితమే శాంటా క్లాస్ పుట్టుకొచ్చాడు. క్రీ.శ.280లో జన్మించిన నికొలస్ క్రీ.శ. 342 డిసెంబర్ 6న చనిపోయాడు. తన దగ్గరున్న విలువైన ఆస్తులన్నింటినీ పేదల కోసం ఉపయోగించాడు. వారి అవసరమేంటో తెలుసుకుని దానికి తగ్గట్టు బహుమతుల రూపంలో ఎవరికీ తెలీకుండా, రహస్యంగా అందించేవాడు. పగలు వాడల్లో కలియ తిరుగుతూ పేదల కష్టాల్ని తెలుసుకుంటూ రాత్రుళ్లు ఎవరూ గమనించకుండా బంగారు నాణేల సంచుల్నో, అవసరమైన వస్తువుల్నో మూట గట్టి ఆ ఇళ్లలో విడిచి వెళ్లేవాడు. పిల్లలంటే ఎంతో ముచ్చటపడే ఆయన తినుబండారాల్ని పంచేవాడు. దేశాటన చేస్తూ అన్నార్తులను ఆదుకుంటున్న సెయింట్ నికొలస్ దాతృత్వం మీద ఎన్నో లెజెండ్స్ ఉండేవి. వాటిలో ఒకటి ముగ్గురు ఆడపిల్లల కథ. ఓ తండ్రి నిరుపేద కావడం వల్ల తన ముగ్గురు కూతుళ్లకు పెళ్లి చేయలేకపోతాడు. వారి పెళ్లీడు వయసు వచ్చేనాటికి డబ్బు కోసం వారిని వేశ్యావాటికల్లో అమ్మేద్దామని నిర్ణయించుకుంటాడు. విషయం తెలుసుకున్న సెయింట్ నికొలస్ ఓ బంగారు నాణేల సంచిని పెద్ద కుమార్తె పెళ్లి కోసం విడిచివెళతాడు. అలా పెద్ద కూతురు పెళ్లి చేశాక రెండో కూతురు సమయంలోను ఇలానే నికోలస్ ఆదుకుంటాడు. మూడో కూతురు విషయంలోను ఇదే జరిగే అవకాశం ఉంటుందని తండ్రి రోజూ రాత్రుళ్లు కాపుగాసి తనకు సాయం చేస్తోంది ఎవరో తెలుసుకోవాలనుకుంటాడు. తీరా ఓ రోజు రాత్రి చూస్తే అది నికొలసే అని గుర్తుపట్టి ప్రపంచానికి తెలియజేస్తాడు. అప్పటి నుంచి ఎవరికి రహస్యంగా సాయమందినా అది సెయింట్ నికొలస్ చలువ వల్లే అని ప్రచారంలోకి వచ్చింది. అందుకే సెయింట్ నికొలస్ చనిపోయిన డిసెంబర్ 6ను ఫీస్ట్ డేగా సెలబ్రేట్ చేసుకుంటారు. ఆ తర్వాత అనేక మార్పులు, చేర్పులు వచ్చి క్రిస్మస్ రోజున క్రిస్మస్ తాత సందడి ఎక్కువ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. నికొలస్ ప్రాధాన్యం తగ్గకుండా

లా బెఫానా

ఇటలీలో అత్యంత ముఖ్యమైన పండుగ పెద్ద లా బెఫానా అనే మంత్రగత్తె. చీపురు మీద రాత్రుళ్లు ఊరంతా తిరిగే ఈవిడ నల్లటి శాలువా కప్పుకుని ఉంటుంది. ఎవరైనా పిల్లలు ఆమె జాడ కోసం ఎక్కడైనా నక్కి చూస్తే కోపం వచ్చేస్తుంది. పిల్లలంతా బుద్ధిగా క్రిస్మస్ ముందు రోజు రాత్రి నిద్రపోవాలి. లేకుంటే ఎత్తుకెళ్లిపోతుందని పెద్దలు చెప్పి హాయిగా బహుమతుల్ని క్రిస్మస్ చెట్టు దగ్గర సర్దేస్తారు. శాంటా క్లాస్ లానే లా బెఫానా కూడా చిమ్నీ నుంచే ఇంటిలోకి వచ్చి బహుమతులు పెట్టి వెళు తుంది. అల్లరి పిల్లలున్న ఇంట్లో అయితే బొగ్గును కానీ, బూడిద గానీ విడిచివెళుతుంది అని చెబుతారు.

ఫాదర్ క్రిస్మస్

యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీ వంటి అనేక దేశాల్లో ఎప్పటి నుంచో ఉన్న ఫాదర్ క్రిస్మస్ ప్రభావం కూడా శాంటా క్లాస్ పాత్రపై ఉంది. ఇప్పటికీ ఆయా దేశాల్లో శాంటా కాకుండా ఫాదర్ క్రిస్మసే పండుగ పెద్ద. పచ్చటి దుస్తుల్ని ధరించే ఫాదర్ క్రిస్మస్ చాలా సంతోషంగా పండగ వాతావరణం ఉండేలా చేస్తాడు. గొప్ప నవలాకారుడు చార్లెస్ డికెన్స్ రాసిన ఓ క్రిస్మస్ కెరోల్ ద్వారా బాగా ప్రాచుర్యం వచ్చింది ఫాదర్ క్రిస్మస్‌కు. ఈ క్రిస్మస్ తాతయ్య కూడా రెయిన్‌డీర్ బండిపై వస్తాడు. ఉత్తర ధృవంలో కాకుండా గ్రీన్‌ల్యాండ్‌లో ఉంటాడని కొన్ని దేశాల్లోను, లేదు ఫిన్‌ల్యాండ్‌లోని ల్యాప్‌ల్యాండ్ ప్రావిన్స్‌లో ఉంటాడని కొన్ని దేశాల్లోను ప్రాచుర్యంలో ఉంది.

థామస్ నాస్ట్ ఊహించిన శాంటా క్లాజ్ రూపం

క్రిస్మస్ తాతగా ఆయన్ను పండగ పెద్దను చేసుకున్నారు. ఆయన ప్రభ తగ్గించడానికి ప్రయత్నాలు జరిగినా ఆయన మీద ఉన్న అభిమానం వల్ల అనేక పాత్రల రూపంలో క్రిస్మస్ తాతలు పుట్టుకొచ్చారు.

శాంటా ఇలా..

అమెరికా, కెనడాలు ఒకప్పటి యూరప్ కాలనీలే కావడం వల్ల డచ్, బ్రిటిష్‌ల మిశ్రమ సంస్కృతుల ప్రభావం ఎక్కువగా ఉండేది. ఇంగ్లండ్‌లో ఎప్పటి నుంచో ఫాదర్ క్రిస్మస్ బహుమతులిస్తాడని ప్రచారంలో ఉండేది. డచ్ వారి సింటర్‌క్లాస్ అనే క్రిస్మస్ తాత కూడా ఈ కోవకు చెందిన వాడే. సెయింట్ నికొలస్‌కు సంక్షిప్త రూపంగా సింటర్‌క్లాస్ అని పిలిచేవారు. ఈ రెండింటి కలయికలో శాంటా క్లాస్ తయారయ్యాడు. అప్పటి వరకు ఓ ఎల్ఫ్‌లానో, మరో రకంగానో క్రిస్మస్ తాతయ్యకు సంబంధించిన కథలు ప్రచారంలో ఉండేవి గానీ ఇతమిద్ధంగా శాంటా క్లాస్ అంటే ఇలా ఉంటాడు అని ఊహించి వివరించింది మాత్రం న్యూయార్క్‌కు చెందిన క్లెమెంట్ క్లార్క్ మూర్ అనే మతాధికారి, రచయితే. తన ముగ్గురు కూతుళ్ల కోసం ఆయనో క్రిస్మస్ పద్యాన్ని రాశాడు. దానిలో శాంటా క్లాస్ ప్రస్తావన తెచ్చాడు. అది కూడా సెయింట్ నికొలస్ సందర్శన గురించి చెప్పడం ద్వారా. ఎగరగలిగే ఎనిమిది రెయిన్‌డీర్లు లాగే బండిపై ఆకాశం నుంచి కిందకు దిగుతూ ఉత్తర ధృవం నుంచి వస్తాడని, ఇళ్ల చిమ్నీల ద్వారా లోపలకు రహస్యంగా ప్రవేశించి మంచి పిల్లలకు క్రిస్మస్ బహుమతులు అందిస్తాడని, ఆయన చాలా లావుపాటిగా బాన పొట్టతో ఉంటాడని, నవ్వుతూ సంతోషంగా కనిపిస్తాడని, వృద్ధ ఎల్ఫ్ అని మూర్ వర్ణించాడు. తన బిడ్డల కోసం రాసిన ఈ పద్యం అచ్చయి శాంటా క్లాస్ పాత్ర ఆ క్రిస్మస్ నుంచే చాలా పాపులర్ అయిపోయింది. న్యూయార్క్‌లో శాంటా క్లాజ్‌గా, పెన్సిల్వేనియాలో క్రిష్‌కింకిల్‌గా క్రిస్మస్ తాతను పిలిచారు. అయితే ఇప్పుడు చూస్తున్న రూపంలో మాత్రం క్రిస్మస్ తాతను చిత్రించింది న్యూయార్క్‌కే చెందిన పొలిటికల్ కార్టూనిస్ట్ థామస్ నాస్ట్. 1863 జనవరి 3న హార్పర్స్ వీక్లీ పత్రిక కోసం ఆయన వేసిన క్రిస్మస్ కార్టూన్ శాంటా క్లాస్‌దే. తెల్లటి ఫర్‌తో లైనింగ్ చేయబడిన ఎర్రటి దుస్తులు, భారీ శరీరం వంటి డిటైల్స్‌తో ఓ రూపం తీసుకువచ్చాడు. బహుమతుల్ని శాంటానే సొంతగా చేసేవాడని, సహాయానికి మరికొందరు ఎల్ఫ్‌లను పెట్టుకున్నాడని జత చేశారు. 1889లో కేథరిన్ లీ బేట్స్ అనే రచయిత్రి 'గూడీ శాంటా క్లాస్ ఇన్ ఏ స్లై రైడ్' అనే పద్యంలో తొలిసారిగా శాంటా భార్య పాత్రను ప్రవేశపెట్టింది. ఇలా క్రమక్రమంగా పూర్తిగా శాంటా క్లాస్ కథ తయారైంది. ఇక శాంటా చేసే సాహసాలు, అద్భుతాల గురించి 1902లోనే ఎల్. ఫ్రాంక్ బామ్ పిల్లల పుస్తకాన్ని తెచ్చాడు.

క్రిస్మస్ తాతలెందరో..!!

ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ తాత అంటే శాంటా క్లాస్ అని బాగా ప్రాచుర్యమైపోయింది. మన దేశంలోను శాంటా క్లాజ్ వేషధారణలో క్రిస్మస్ శుభాకాంక్షలు చెప్పుకోవడం అదో సరదా. అసలు ఓ గిన్నిస్ వరల్డ్ రికార్డే శాంటా క్లాస్ వేషధారణ పెరేడ్ మీద మన దేశానికి ఉంది. కేరళలోని త్రిస్సూర్‌లో గత క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 27న మొత్తం 18, 112 మంది క్రిస్మస్ తాత వేషంలో పెరేడ్ చేశారు. కానీ, ఒక్కో దేశంలో ఒక్కో పేరుతోనో, పూర్తిగా వేరే వ్యక్తిగానో క్రిస్మస్ తాత ఉన్నాడు. వీరు శాంటా కన్నా పూర్వం నుంచి ఉన్నారు. ఆయా దేశాలలో వినికిడిలో ఉన్న జానపద కథలు, పిల్లల కథలలోని పాత్రలుగా లేదా గొప్ప వ్యక్తులనే వారు క్రిస్మస్ తాతయ్యలుగా చెబుతారు. వీరంతా పిల్లలకు బాగా ఇష్టమైన వ్యక్తులు. చైనాలో షెంగ్డాన్ లువోరెన్, కోస్టారికా, మెక్సికో, కొలంబియాల్లో పసిపాప ఎల్‌నినో జీసస్, రష్యాలో బబౌష్కా అనే బామ్మ, బ్రెజిల్, పెరూల్లో పాపాయ్ నోయల్ కూడా బహుమతులు అందిస్తారు. క్రిస్మస్ నాడు కాకుండా జనవరి 6న ఎపిఫనీకి గుర్తుగా ప్యూర్టోరికోలో 'త్రీ కింగ్స్' క్రిస్మస్ బహుమతులు ఇస్తారని చెబుతారు. పిల్లలు దిండ్ల కింద త్రీ కింగ్స్ ఒంటెల కోసం గడ్డి దాస్తారు. దాని స్థానంలో బహుమతుల్ని పెద్దలు ఇస్తారు. ఇంటి పెద్దలో, తల్లిదండ్రులో లేదా సంస్థలో క్రిస్మస్ తాత పేరిట బహుమతులు అందించడం ఆనవాయితీగా వస్తోంది. వాటిని జాగ్రత్తగా రహస్యంగా పిల్లలు చూడకుండా సాక్స్‌ల్లో

పెట్టడం జరుగుతుంది.

యూల్ ల్యాడ్స్

యూల్‌మెన్‌గానూ పిలిచే ఇవి మొత్తం 13 విచిత్రమైన జీవాలు. వీరి కథ ఐస్‌ల్యాండ్‌లో బాగా ప్రచారంలో ఉంది. ఇది కూడా 1930 నాటి పద్యం ద్వారానే పాపులర్ అయ్యింది. ఒక్కోటి ఒక్కో ట్రిక్ చేస్తాయని, ఇవి చెడ్డ పిల్లల్ని ఎత్తుకు పోతాయని, వీటి దగ్గర ఉండే ఓ పిల్లి చాలా ప్రమాదకారి అని చెప్పుకుంటారు. అల్లరి పిల్లలకు బంగాళాదుంపల్ని, మంచి పిల్లలకు విలువైన బహుమతుల్ని అందిస్తాయని చెబుతారు. కెట్రోకర్ అనే జీవేమో దాని పొడవాటి గేలం ద్వారా మాంసం ఎత్తుకుపోతుందని, గ్లుగ్గగైజిర్ అనే మరో జీవి కిటికీల గుండా ఇంట్లోకి తొంగి చూస్తూ అందర్నీ ఓ కంట కనిపెడుతుందని ఆ పాత్రల స్వభావాన్ని రాశారు. స్టెక్‌జాస్టార్ పెగ్‌లెగ్స్ మీద నడుస్తూ గొర్రెల్ని ఆటపట్టిస్తుంది. రాత్రుళ్లు గొర్రెల మంద అలజడి చేస్తుంటే ఈ జీవే వచ్చిందని పిల్లలు మంచం కింద దాక్కుంటారు. పెద్దలేమో వారిని చూసి నవ్వుకుంటారు.

టోమ్టే

స్కాండినేవియా దేశాలైన నార్వే, ఫిన్‌ల్యాండ్, స్వీడన్‌లో ఈ టోమ్టే పిల్లలతో దోస్తీ కడతారు. నిస్సేగాను పిలుచుకునే టోమ్టే బుల్లిగా ఉండే గ్నోమ్‌లు. పంట పొలాలను వీరు కాపుగాస్తుంటారు. ఎవరైనా పొలాల్ని చూసుకోవడంలో అశ్రద్ధ చేస్తే ఊరుకోరు. ట్రిక్స్‌తో వారిని ఆటపట్టిస్తారు. ఈ టోమ్టే కథలు స్థానికంగా ఎప్పటి నుంచో ఉన్నాయి గానీ క్రైస్తవం ఉనికి ఎక్కువ కావడంతో క్రిస్మస్ పండుగలోకి ఆ పాత్రలు ప్రవేశించాయి. మనిషి పోలికల్ని పెంచి క్రిస్మస్‌నాడు హంగామా చేసేలా మార్చారు. ఇప్పుడు జుల్టోమ్టే, జులనిస్సే, జౌలుపుక్కీగా కొత్త పాత్ర హల్‌చల్ ఎక్కువ. ఇళ్లకు దగ్గరలో ఉండే అడవుల్లోనే ఉంటారని పిల్లలకు చెబుతారు. వారి తాతయ్యో, బామ్మో టోమ్టేలా దుస్తులు ధరించి నేరుగా పిల్లలకు బహుమతులు పంచుతారు.

బెల్స్నిక్కెల్

కొండ మనిషిలా ఒళ్లంతా జుట్టుతో ఉండే బెల్స్నిక్కెల్ ఒక్కోసారి పొడవాటి నాలుక ఉన్న మాస్క్ ధరించి కూడా వస్తాడని పిల్లలకు చెబుతారు. శాంటాలా కాకుండా అల్లరి పిల్లలకు బుద్ధి చెప్పడానికి ఈ పాత్రను రూపొందించారు. తెగ అల్లరి చేసే వారికి ఈ బెల్స్నిక్కెల్ గురించి చెప్పి క్రిస్మస్ రోజు తుంటరి వేషాలు వేయకుండా కట్టడి చేస్తారు. బుద్ధిగా ఉంటే బహుమతులు కూడా ఇస్తాడని భయం కాస్త తగ్గిస్తారు. మంచి పిల్లలకు క్యాండీలు, బొమ్మలు ఇస్తే అల్లరి మానని వారికి బొగ్గు ముక్కో, స్విచ్చులో గానీ ఇస్తారు.

టోమ్టే

సింటర్ క్లాస్ అండ్ బ్లాక్ పీటర్

పెరె నోయెల్, లా పెరె ఫాయెటార్డ్

పాపా నోయెల్‌గాను పిలిచే పెరె నోయెల్ చూడ్డానికి శాంటా క్లాస్‌గానే కనిపిస్తాడు. అయితే రెయిన్‌డీర్ల బదులు గుయ్ అనే గాడిదను బండి లాగేందుకు వాడతాడు. లా పెరె ఫాయెటార్డ్ మాత్రం బెల్స్నిక్కెల్‌లా అల్లరి పిల్లల ఆట కట్టిస్తాడు. 11వ శతాబ్దం నాటి ఓ కథలో లా పెరె ఫాయెటార్డ్ దుష్టుడని సెయింట్ నికొలస్ అతణ్ని మంచిగా మార్చి తన సహాయకుడిగా ప్రజలకు సేవ చేయించాడని ఉంది. చలి కాచుకునే ఫైర్ ప్లేస్ పక్కనుండే బూట్లు, షూలలో బహుమతులు పెడతాడు. లా పెరె యేమో తుప్పు పట్టిన ఇనుప గొలుసులు పట్టుకుని అల్లరి పిల్లల కోసం వెతుకుతాడు.

క్రాంపస్

క్రిస్మస్ తాతయ్య దగ్గరుండే ఈ జీవి గురించి ఆల్పైన్ దేశాల్లో బాగా ప్రాచుర్యం ఉంది. భయంగొలిపేలా ఉండే ఈ జీవి అల్లరి పిల్లల ఆగడాలను అడ్డుకట్ట వేయడానికి చాలా కాలం

క్రాంపస్

లా బెఫానా

డెడ్ మొరోజ్, స్నో మైడెన్

డెడ్ మొరోజ్, ది స్నో మైడెన్

మంచు తాతయ్య (గ్రాండ్‌ఫాదర్ ఫ్రాస్ట్)గాను పిలిచే డెడ్ మొరోజ్ కథ రష్యా, సెర్బియా, బోస్నియా, ఉక్రెయిన్, మేసిడోనియా, పోలాండ్ వంటి ఒకప్పటి సోవియట్ దేశాలలో ప్రాముఖ్యం సంతరించుకుంది. శాంటాలానే కనిపించే ఈ క్రిస్మస్ తాతయ్య రెయిన్‌డీర్ బండికి బదులు రష్యాలో బాగా ఉపయోగించిన ట్రోయికా అనే గుర్రపు బగ్గీని వాడతాడు. కథ ప్రకారం డెడ్ మొరోజ్ ఓ మాంత్రికుడు. తన ట్రిక్స్‌తో పిల్లల్ని ఎత్తుకెళ్లి వారిని విడిచిపెట్టాలంటే బహుమతులు ఇవ్వాలని డిమాండ్ చేసేవాడు. ఆ తర్వాత అతడిలో మార్పు వచ్చింది. అప్పటి నుంచి తానే పిల్లలకు బహుమతులు ఇస్తూ తన తప్పును తగ్గించుకుంటున్నాడు. అప్పుడప్పుడూ ఈ తాతతో ఆయన మనవరాలు స్నెగురోచ్కా కూడా కలిసి వస్తుంది. ఆమెనే స్నో మైడెన్ అని పిలుస్తారు. క్రిస్మస్, న్యూ ఇయర్ చెట్టు కింద బహుమతులు పెట్టి వెళతారు.


సెయింట్ నికొలస్

క్రితమే సృష్టించారు. బవేరియా, ఆస్ట్రియాల్లో ఇప్పటికీ క్రాంపస్ గురించి కథలు చెబుతుంటారు. క్రాంపస్ వేషధారణలో గుంపులుగా వీధుల్లో తిరుగుతూ సరదాగా అందర్నీ భయపెడుతుంటారు. ఊరిలోని బాగా అల్లరి చేసే పిల్లలందర్నీ ఎత్తుకెళ్లి చుట్ట చుట్టేసి నదిలో పడేస్తాడని తెగ భయపెట్టేస్తారు పెద్దలు.

క్రైస్ట్ కైండ్

క్రైస్ట్ చైల్డ్ అని కూడా పిలిచే ఈ పండుగ పాత్రను మార్టిన్ లూథర్ సృష్టించాడు. 15వ శతాబ్దిలో సెయింట్ నికొలస్ ప్రభావం తగ్గించడానికి ఈ పాత్రను రచించారని చెబుతారు. బాల యేసులా కనిపించే ఓ చిన్న బాబు రెక్కలతో, బ్లాండ్ జుట్టుతో చాలా ముద్దుగా ఉంటాడు. బహుమతులు ఆయన పేరిట ఇస్తారు. శాంటా క్లాస్ ప్రభావం ఎక్కువగా ఉన్నా ఇప్పటికీ మధ్య, దక్షిణ అమెరికాల్లో క్రైస్ట్ చైల్డ్ పేరిట ఘనంగా పిల్లల కార్యక్రమాలు జరుగుతాయి.

ఎన్ని విన్నపాలో...

శాంటా క్లాస్ పేరిట బహుమతులు తీసుకోవడమే తప్ప ఎప్పుడూ నేరుగా అతణ్ని చూడలేని పిల్లలు కనీసం ఉత్తరాల ద్వారానైనా మాటా మంతి కలిపేందుకు ఓ ఐడియా వేశారు. క్రిస్మస్ తాతకు ప్రతి ఏటా కోట్లాది మంది పిల్లలు తమ కోర్కెల చిట్టా తెలుపుతూ ఉత్తరాలు రాస్తుంటారు. తొలుత వీటిని ఆయా దేశాల పోస్టాఫీస్ వారు పట్టించుకోకపోయినా శాంటా క్లాస్‌కు వచ్చిన పాపులారిటీతో వాటికి బదులు రాయడం మొదలుపెట్టారు. వీటి కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార సంస్థలు పనిచేస్తాయి. సుమారు 126 దేశాల్లో క్రిస్మస్ తాత ఉత్తరాల హంగామా అంతా ఇంతా కాదు. 2014 సందర్భంగా ఫ్రాన్స్‌లో 12 లక్షల 20 వేల ఉత్తరాలు అంది టాప్‌గా నిలిచింది. కెనడా అయితే శాంటా క్లాస్‌కు తమ దేశ పౌరసత్వాన్నే ఇచ్చేసింది. ఉత్తర ధృవంలోని హో..హో..హో అనే ప్రాంతంలో శాంటా క్లాస్ నివసిస్తాడని కథలో ఉండటంతో ఆ భూభాగం తమ దేశం కిందకు వస్తుందని కెనడా చెబుతోంది. క్రిస్మస్ తాతకు వచ్చే ఉత్తరాల బాధ్యులు క్యుబెక్‌లోని మాంట్రియల్ దీవికి చెందిన పోస్టాఫీస్ శాఖ వారు. నార్త్ పోల్ హెచ్‌ఓహెచ్ పోస్ట్‌మార్క్‌తో అందే ఉత్తరాలకో ప్రత్యేకత ఉంది. పిల్లలు తాము ఏ పర్యాటక ప్రదేశంలో తిరగాలని కోరుకుంటారో ఉత్తరం రాస్తే ప్రైవేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తుల సాయంతో వారి మురిపెం తీర్చేందుకు ప్రయత్నిస్తారు. అలాస్కాలోను నార్త్‌పోల్ సిటీ ఉంది. ఇక్కడ కూడా శాంటా క్లాస్ హౌజ్ ఉంది. తమ అమ్మకాలు భారీగా పెంచుకోవడానికి క్రిస్మస్ తాతను కార్పొరేట్ వ్యాపార సామ్రాజ్యాలు అతిగా వాడుకోవడాన్ని కొన్ని క్రైస్తవ శాఖలు తప్పుబడుతున్నాయి. క్రిస్మస్ తాత పేరిట చేసే వ్యాపారాలపై ప్యూరిటాన్స్, కాల్వినిస్టులు అగ్గిమీద గుగ్గిలమవుతారు. తల్లిదండ్రులు, పెద్దలే రహస్యంగా బహుమతుల్ని పెట్టి వాటిని శాంటా అందిస్తున్నాడని మాయ చేయడం మంచిది కాదని మానసిక నిపుణులు వాదిస్తారు. శాంటా క్లాస్‌పై విపరీతమైన అభిమానం పెంచుకునే పిల్లలకు అనుకోకుండా ఓ చిన్న బహుమతి కూడా అందకపోతే చాలా దిగులు పెట్టుకుంటారని, తల్లిదండ్రులే ఏర్పాటు చేస్తున్నారని తెలిస్తే అన్నాళ్ల ఓ పెద్ద నమ్మకం మీద దెబ్బతగిలి విపరీత భావోద్వేగాలకు గురవుతారని అంటారు. అయితే సరదాగా, సంతోషంగా పండుగ నిర్వహించుకోవడానికి క్రిస్మస్ తాతే ఓ పెద్ద అయిపోయాడు. ఇప్పుడు చాలా వరకు రహస్యంగా కాకుండా నేరుగా శాంటా క్లాస్ వస్త్రధారణలో ఉన్న వ్యక్తుల ద్వారా బహుమతులు ఇప్పిస్తున్నారు కాబట్టి పెద్దగా నష్టమేం లేదనేది కొందరి వాదన. కేవలం ఓ మంచి విషయంగా మాత్రమే చూస్తూ పదుల అనుభూతుల్ని, వందల నవ్వుల్ని మూటగట్టుకోవాలంటే క్రిస్మస్ తాత మూట విప్పాల్సిందే. పండుగకు ఉత్సాహం తేవాల్సిందే.

సింటర్ క్లాస్ అండ్ బ్లాక్ పీటర్

స్పెయిన్ నుంచి స్టీమ్ బోట్ మీద నెదర్లాండ్స్‌కు నవంబర్ నాటికే సింటర్ క్లాస్ వచ్చేస్తాడని, ఊరంతా కలియ తిరుగుతూ పిల్లలందర్నీ పరికిస్తాడని ప్రచారం. శాంటా క్లాస్‌లా ఎల్ఫ్‌లను కాకుండా బ్లాక్ పీటర్ అనే పిల్లాడిని సింటర్‌క్లాస్ వెంట తీసుకెళతాడు. ఓ దెయ్యంగాను, నల్ల జాతి బానిసలాను కథలో పేర్కొనడంతో బ్లాక్ పీటర్ పాత్రపై విమర్శలు ఎక్కువవడంతో పాత్ర కథ, తీరును మార్చారు. అతడు చిమ్నీ గుండా ఇంటి లోపలకు వచ్చి మంచి పిల్లలకు బహుమతులు, అల్లరి పిల్లలకు ఉప్పు సంచి, బొగ్గు ముక్కల్నో వదిలి వెళతాడు. పిల్లలు సింటర్‌క్లాస్ గుర్రం కోసమని ఉంచిన క్యేరట్లను తీసుకెళతాడు. సింటర్‌క్లాస్ మాత్రం ఇంటి బయటి నుంచే ఈ విషయాల్ని గమనిస్తుంటాడు.

తొమ్మిదో రెయిన్ డీర్

పిల్లలు ఇష్టపడేలా రెయిన్‌డీర్ల పేర్లను పెట్టారు. వారి ఆటపాటలు, అతిశయాలకు దగ్గరగా ఉంటాయా పేర్లు. డాషర్, డ్యాన్సర్, ప్రాన్సర్, విక్సెన్, కోమెట్, క్యూపిడ్, డండర్ (థండర్), బ్లిక్సెమ్ (లైట్నింగ్). మాంటిగోమెరికి చెందిన మరో రచయిత మరో అడుగు ముందుకు వేసి తొమ్మిదో రెయిన్ డీర్‌ను కథలో ప్రవేశపెట్టాడు. ఇది క్రిస్మస్ అమ్మకాల్ని పెంచేందుకే. రుడాల్ఫ్ అని పిలవబడే ఈ రెయిన్‌డీర్ కథ చాలా గమ్మత్తుగా ఉంటుంది. దీనికి ఎర్రటి మెరిసే మూతి ఉంటుంది. మిగతా వాటిలా ఉండకపోవడంతో అన్నీ దీన్ని వెక్కిరించేవి. జట్టులో కలుపుకునేవి కాదు. కానీ, ఓ సారి శాంటా క్లాస్ ప్రయాణానికి భారీగా కురుస్తున్న మంచు అడ్డు వచ్చిందట, దారి కనిపించలేదట అప్పుడు తన ఎర్ర మూతి నుంచి వచ్చే వెలుగు ద్వారా గమ్యానికి చేరవేసింది. అప్పటి నుంచి శాంటాకు అదే ఫేవరెట్ అయ్యింది. అని సాగుతుంది కథ. మాంటిగోమెరీ స్టోర్స్‌కు చెందిన రాబర్ట్ ఎల్. మే అనే కాపీ రైటర్ 1939లో రాసిన ఈ పద్యం మూర్ రాసిన 'నైట్ బిఫోర్ క్రిస్మస్' పద్యం రైమింగ్‌కు సరిపోతుంది. ఆ ఏడాది క్రిస్మస్ సందర్భంగా అమెరికాలో ఈ పద్యం 25 లక్షల కాపీలు అమ్ముడుబోయింది. అదో సంచలనం. తర్వాత మరో 35 లక్షల కాపీలు అమ్ముడుబోయాయి. రుడాల్ఫ్ ఆధారంగా మే స్నేహితుడు జానీ మార్క్స్ చిత్రించిన పాట కూడా 20 లక్షల కాపీలు అమ్ముడుబోయింది. దీన్ని 25 భాషల్లోకి అనువదించారు. 1964లో బర్ల్ ఐవ్స్ రచనలో ఓ చిత్రం కూడా విడుదలైంది.

చూద్దామా

డయ్యూ కోట, లైట్ హౌజ్

కామ్‌గా ఉండే 'ఇల్హా డి కామా' (డయ్యూ)కు హుషారుగా స్వాగతం పలుకుతోంది 'ఫెస్ట డి డియూ'. ఈ నెల ఒకటిన ప్రారంభమైన ఈ బీచ్ పండుగ 2016 ఫిబ్రవరి 15 వరకు సందడి చేయనుంది. పోర్చుగీసులో ప్రశాంత దీవిగా పిలిచే డయ్యూ ఆటపాటలు, విందు వినోదాలతో హోరెత్తిపోతోంది. ఆసియాలోనే అతి పెద్ద బీచ్ ఫెస్టివల్‌కు సర్వ హంగులు సమకూర్చుకుంది. భారతీయం, పాశ్చాత్యాలను కలబోస్తూ రెండు ధృవాలను, రెండు సంస్కృతులను, రెండు పార్శ్వాలను నిండుగా రంగరించుకుని కనువిందు చేస్తోంది.

డయ్యూ బీచ్ పండగ

మామూలు రోజుల్లోనే డయ్యూ ఓ సందర్శనా ప్రాంతం. విదేశీ పర్యాటకులకు గమ్యస్థానం. దీని సముద్ర తీరాల్లో సేద తీరడమంటే అది ప్రపంచాన్ని కాసేపు మరిచిపోయి ప్రశాంతంగా మనసును విహరింపజేయడమే. ఎప్పుడూ బద్ధకంగా నిద్దురేనా కాసేపు చిందేయమని బీచ్ ఫెస్టివల్ ట్యూన్ చేస్తోంది. 75 రోజులపాటు సాగే ఈ బీచ్ ఫెస్టివల్‌కు సుమారు 35 లక్షల మంది హాజరవుతారని అంచనా. కేవలం ఈ సంబరాల కోసమే విలాస గుడారాలతో కూడిన ఓ ఫెస్టివల్ విలేజీని రూపొందించారు. డయ్యూలో ఇప్పటికే ఉన్న 2500 హోటల్ రూమ్‌లకు ఇవి అదనం. పండగ జరిగినన్నాళ్లూ... వివిధ రంగాలకు చెందిన 300 మంది కళాకారులు, సెలబ్రెటీలతో మొత్తం 140 లైవ్ ఈవెంట్‌లకు ఏర్పాట్లు చేశారు. కన్సెర్ట్(కచేరీ)లకు లేజర్ షోతో కూడిన వేదికలు అలరిస్తున్నాయి. రాత్రుళ్లు సముద్ర హోరుతో కలిసి సాగే రాక్ బ్యాండ్‌ల మ్యూజిక్ మాయాజాలానికి తీరమంతా ప్రాణం పోసుకుంటోంది. ఒకవైపు భరతనాట్యం, లంబాడా నృత్యం వంటి భారతీయ శాస్త్రీయ నాట్యాలను హైలైట్ చేస్తూనే మరో వైపు బ్యాడ్ సాల్సాలతో చెలరేగేలా యువతకు కిక్కిచ్చే ప్రోగ్రామ్‌లెన్నో. కామెడీ షోలు, మైమ్, థియేట్రికల్స్, తోలుబొమ్మలాటలు ఇలా క్షణం తీరిక లేని బిజీ షెడ్యూల్ ఔత్సాహికులను రారమ్మని పిలుస్తోంది. సితార్, తబలా వాద్యాలకు గిటార్, ట్రాంపొలిన్‌లను జత కలుపుతోంది. ఇవి కాక సింఫనీ ఆర్కెస్ట్రా సైతం సై అంటోంది. వాటర్ గేమ్స్‌కు తోడు బీచ్ స్పోర్ట్స్, బెలూనింగ్‌కు కాంట్రాస్ట్‌గా బంగీ జంపింగ్ ఇలా సాహస క్రీడలకు కాసింత జాగా అట్టిపెట్టారు. కార్నివాల్‌లతో, జామ్ సెషన్లతో ఈ సంరంభమంతా సంభ్రమంగా సాగిపోయేలా మొత్తం వేడుకల్ని నాలుగు జోన్లుగా, పది థీమ్ వారాలుగా ఒక్కో ప్రత్యేకతతో జరుపుతున్నారు. కేవలం మస్తీనే కాదు కమ్యూనిటీ ఔట్ రీచ్ వర్క్‌షాపులు, నేచురల్ హీలింగ్ కార్యక్రమాలు కూడా ఉన్నాయి. ఇక విందు పసందు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సింది లేదు. పలు రకాల వంటకాలతో పాటు వంటల పోటీలు, వర్క్‌షాప్‌లు కూడా ఉండబోతున్నాయి. గాలి పటాల పండుగ, పడవ పందేలు, మారథాన్ కూడా ఉన్నాయి. ప్యాట్రియాటిక్ వీక్ సందర్భంగా డయ్యూ విద్యార్థులు కళ్లకు కట్టనున్న కొరియోగ్రాఫ్‌డ్ యాక్ట్ గురించి గొప్పగా చెప్పుకుంటున్నారు స్థానికులు. పోర్చుగీసు వారి నుంచి డయ్యూను

ఇలా చేరొచ్చు

అహ్మదాబాద్‌కు 450 కి.మీ.లు, ముంబైకు 815 కి.మీ.ల దూరంలో ఉండే డయ్యూకు నేరుగా విమానంలో చేరుకోవచ్చు. ఫెస్టివల్ సందర్భంగా రోజూ ప్రత్యేక విమానాలు నడవనున్నాయి. వేరవల్ రైల్వేస్టేషన్ డయ్యూకు 90 కి.మీ.ల దూరంలో ఉంటుంది. ముంబై, అహ్మదాబాద్, పూణె, జబల్‌పూర్, ద్వారక, తిరువనంతపురం నుంచి డైరెక్ట్ ట్రైన్‌లున్నాయి. గుజరాత్‌లోని ఉనా నుంచి లోకల్ ట్రాన్స్‌పోర్ట్ అందుబాటులో ఉంటుంది.

థీమ్ తనానా

- కలర్స్ ఆఫ్ ఇండియా వీక్... భారతీయ సంస్కృతిని కళ్లకు కట్టేందుకు.
- రిథమ్ అండ్ బ్లూస్ వీక్... సంగీతానికి అంకితం. ప్రాచ్య, పాశ్చాత్యాలు ఒక్కటిగా ధ్వనించే వేదిక.
- డీయూ లిబరేషన్ వీక్... భారత సమాఖ్యలో చేరిన దానికి గుర్తుగా.
- క్రిస్మస్ ఫెస్టివల్ వీక్... డయ్యూలో పెద్ద ఎత్తున సాగే ఈ పండుగను అందరికీ పంచేందుకు.
- న్యూ ఇయర్ బొనాంజా వీక్... నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు.
- వెల్‌నెస్ వీక్... యోగా, నేచురల్ హీలింగ్, ఏక్రోబాట్స్ నేర్పేందుకు.
- లాఫ్టర్ వీక్... కామెడీ షోలతో, ఈవెంట్లతో కడుపారా నవ్వించేందుకు.
- వండర్‌ల్యాండ్ వీక్... చిన్నారులకు కావాలిగా సంబరాలు.
- ఫెస్టివల్ ఆఫ్ ఆర్ట్స్ వీక్... టెర్రకోట కళ నుంచి సైకత శిల్పం వరకు కళలను కళ్లకు కట్టేందుకు.
- పేట్రియాటిక్ వీక్, డ్యాన్స్ వీక్, చివరగా స్ప్రింగ్ ఫెస్టివల్ వీక్‌తో ముగింపు.

దక్కించుకోవడానికి యూనియన్ సైన్యం ఎన్ని త్యాగాలు చేసింది, ఎంత పోరాట పటిమ చూపింది అనేదే ప్రధాన అంకం. లేజర్ ఏంజెల్స్, మల్ల కంభం కూడా ప్రత్యేక ఆకర్షణలే. పుంగ్ చాలోమ్, థాంగ్టా వంటి దేశీ మార్షల్ ఆర్ట్స్ కూడా మధ్యమధ్యన తళుక్కుమంటున్నాయి.

రయ్యిన డయ్యూలో..

డయ్యూలోకి అడుగు వేస్తే కొత్త వీధుల్ని దాటేస్తే మీకు పురానా పోర్చుగీసు కాలనీ వాతావరణం పరిచయమవుతుంది. 16వ శతాబ్దిలోనే నిలిచిపోయిన పురవీధుల ఇరుకులో దాని విలక్షణీయత ఒళ్లు విరుచుకుంటుంది. బరోక్ శైలిలో కట్టిన వందల ఏళ్ల నాటి కేథడ్రల్‌లు అప్పటి

కచేరీల వేదిక

కాలానికి ఎత్తుకు పోతాయి. వాటిలో ఒకటి మ్యూజియం, మరోటి ఆస్పత్రిగా మలిచినా ఇప్పటికీ ప్రార్థనలు సాగే కేథడ్రల్ డయ్యూకు ఇంకా ల్యాండ్‌మార్క్‌గా నిలిచే వుంది. పై అంతస్తుల నిర్మాణాలు చాలా అరుదు. పానీమా, జేతిమా పురానా హవేలీలు, విల్లా మ్యూజియం చూడకుండా రాకూడదు. సైకిల్ సవారీకి వేసిన ఆధునిక ట్రాక్‌లు ఆ ఇరుకు మలుపుల్లో ఎక్కడలేని స్వేచ్ఛను కలిగిస్తాయి. డయ్యూ పోర్చుగీసు జాడల్ని కనిపెట్టాలంటే ఇదో ఉత్తమ మార్గం. వీధిలోని చాలా ఇళ్లు ఓ సినిమా సెట్టింగ్‌ను తలపిస్తాయి. కొత్తగా కట్టేవి కూడా వీటి శైలిలోనే. అలా వారు డయ్యూ ప్రత్యేకతను జాగ్రత్త చేసుకుంటున్నారు. గజిబిజి దీవి కొలతల్ని కప్పేస్తూ సాగిన కోట నిర్మాణం ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తే కోటంతా సముద్రంలో తేలుతున్నట్టుండే పానీ కా ఖిల్లా అల్లంత దూరాన కనిపిస్తూ అచ్చెరువులు ఇంకా ఇక్కడ చాలానే ఉన్నాయని చెబుతుంది. చేపల వేట ప్రధానంగా సాగుతుందిక్కడ. హార్బర్‌లో చిన్న చిన్న మరబోట్ల నుంచి భారీ నిల్వ నౌకలూ కనిపిస్తాయి.

చక్రతీర్థ్ బీచ్

డయ్యూకు దక్షిణ భాగంలో ఉండే ఈ బీచ్‌కు కుటుంబంతో సహ హాజరవ్వొచ్చు. ప్రశాంతమైన వాతావరణం, పచ్చని ప్రకృతి, మంద్రంగా వినిపించే కెరటాల ఆటుపోటు శబ్దాలు, కనుచూపుమేరంతా సముద్రం. దీనికి దగ్గరలోనే ఓ మనోహరమైన శివాలయం ఉంది.

డయ్యూ కోట

16వ శతాబ్దిలోనే కట్టేసిన ఈ కోట అనేక యుద్ధాలకు సాక్షి. పోర్చుగీసు వారి కోట కట్టడాలకు చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. ముఖ్యంగా దీవుల్ని కోటలుగా మలచడంలో వారికి వారే సాటి. ప్రాచీన ట్రేడ్ రూట్లో ఓ కీలక రక్షణ స్థావరం. ఇక్కడ సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు సందర్శకులకు విలువైన సమయాలు.

నైడా గుహలు

జలంధర్ బీచ్‌కు దగ్గరలో ఉండే ఈ గుహల్లో కాంతుల గలగలలు కనిపిస్తాయి. సూర్యకిరణాలు ధార కట్టినట్టు, జలపాతంలా నేల దిగుతున్నట్టు చాలా చిత్రంగా కాంతి ఈ గుహల్లో ప్రసరిస్తుంది.

వివిధ షేడ్స్‌లో నారింజ వర్ణంలో రాళ్లు మెరిసిపోతుంటాయి. దీనికి కారణం శిలల తీరు, ప్రకృతి సహజంగా ఏర్పడిన వందలాది రంధ్రాలే.

ఫూదామ్ పక్షి సంరక్షణ కేంద్రం

ద్వీపమంతా పక్షుల కిలకిలారావాలు వినిపిస్తూనే ఉంటాయి గానీ ఇక్కడకు చేరుకుంటే మాత్రం వాటికి వెంటనే ఫ్రెండ్ రిక్వెస్ట్ పెట్టాలనిపిస్తుంది. ఇక్కడి మడ అడవులు, స్వాంప్‌లే కాదు సముద్ర చేపలు మంచి విందును అందిస్తాయని ఎక్కడెక్కడి నుంచో పక్షులు గుంపులు కట్టేసి వాలిపోతాయి.

నాగోవా తీరం

ఎంత సేపని తీరంలో నడవటం కాళ్లు నొప్పెడుతున్నాయి అనుకుంటే ఎంచక్కా ఒంటెక్కి బీచ్‌లో చక్కర్లు కొట్టొచ్చు. కుదిరితే గుర్రాలు వెంటొస్తాయి. సందర్శకుల తాకిడి ఎక్కువే ఉన్నా నీరు మాత్రం చాలా స్వచ్ఛంగా ఉంటుంది. తీరం లోతు తక్కువ. దేశం మొత్తమ్మీద హోకా పామ్ చెట్లు ఇక్కడ మాత్రమే కనిపిస్తాయి. పోర్చుగీసు వారు కోరి మరీ తెచ్చుకున్నవవి. ఇక్కడ ఉన్న లైట్ హౌజ్ దగ్గర ఓ ఫొటో దిగడం మర్చిపోకూడదు.

ఇంకా ప్రధాన ఆకర్షణలేమంటే ఐఎన్ఎస్ కుక్రీ మెమోరియల్, భారీ యాంపీ థియేటర్, గంగేశ్వర్ పోర్ట్. ఇవి సరిపోవంటే, ఓ 67 కి.మీ. దూరంలో గుజరాత్‌లోని గిర్ అభయారణ్యం ఉంది. సింహాలు, చిరుతలు, మొసళ్లు, పులులు, హైనాలు వంటి వాటిని దగ్గరగా చూసేందుకు జీప్ సఫారీలు ఉన్నాయి. సోమ్‌నాథ్ జ్యోతిర్లింగ శైవ క్షేత్రం కూడా 90 కి.మీ.ల దగ్గరలో ఉంటుంది. డయ్యూ–డామన్‌ను కలేసి పిలుస్తారు గానీ, రెండిటికీ మధ్య సుమారు 650 కి.మీ.ల దూరం ఉంటుంది. ఈ రెంటినీ గుజరాత్ పర్యాటకంతో కలిపి అనేక ప్యాకేజీల్ని రూపొందించే కంపెనీలుంటాయి. ప్రయాణ బడలిక మీకు పెద్ద కష్టం కాకపోతే, అసలు యాత్రల్లోని మజా అంతా ప్రయాణంలోనే ఉంటుందనే వారైతే బ్యాగులు, ప్యాకులు సర్దేయొచ్చు.

✦

వీర్నీ అంటే వీర వనిత అని అర్థం రాజస్థానీ మాండలికంలో. కానీ ఆ పదానికి అర్థం తెలీని వయసులోనే వారి స్వేచ్ఛను, హక్కును, స్వతంత్రతను, అభిప్రాయాన్ని, ఆశల్ని, ఆలోచనల్ని కప్పం కట్టేస్తున్నారు బాల్యవివాహాలతో తల్లిదండ్రులు. చిన్న నాటే పెళ్లిళ్లై చదువుకు దూరమై బందీఖానా బతుకులకు ఆచారం వంకో, పేదరికం వల్లో, మూర్ఖత్వంతోనో బాలికల్ని బలి పశువుల్ని చేస్తున్న గ్రామాలు వేలాదిగా ఉన్నాయి. వాటిలో కొన్నింటిలోనైనా మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తోంది వీర్నీ ఇన్‌స్టిట్యూట్.

మార్పు కోరే 'వీర్నీ'

చోలెట్

వీర్నీ వెనుక వుంది జాక్వెలిన్ డి చోలెట్ అనే స్విట్జర్లాండ్ మహిళ. 1990ల్లో రాజస్థాన్ పర్యటనకు వచ్చిన ఆమె ఓ గ్రామాన్ని సందర్శిస్తుండగా ఓ చిన్న ఇల్లు ఆకర్షించింది. ఆ ఇంటి గృహిణి భన్వరి చాలా నేర్పుగా అల్లుతున్న షాల్‌పై మనసు పడింది. అల్లిక చివరికి చేరుకుందని తెలిసి కాసేపు వేచి చూసింది. షాల్ పూర్తవడంతో తగిన డబ్బును భన్వరి చేతిలో పెట్టింది. భర్త ఎక్కడి నుంచి వచ్చాడో తటాలున డబ్బు లాక్కుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. భన్వరి కళ్లలో కనిపించిన నిర్లిప్తత చూసి చోటెల్ మనసు చివుక్కుమంది. లాక్కెళ్లిపోయింది డబ్బు కాదని భన్వరి స్వతంత్రాన్ని, కష్టాన్ని అని అర్థం చేసుకున్న ఆమె అక్కడి స్త్రీల స్వేచ్ఛాభంగ జీవితాల గురించి తెలుసుకుని తన పని మొదలెట్టింది. అదే వీర్నీ. రాజస్థాన్‌లోని 40 గ్రామాల్లో ప్రస్తుతం ఈ సంస్థ సేవలందిస్తోంది. ఏటా 70 మంది బాలికలకు బోర్డింగ్ స్కూల్‌ను ఉచితంగా నిర్వహిస్తోంది. బాలికల్ని వీర్నీలుగా తయారుచేయడమే తుది లక్ష్యంగా చాపకింద నీరులా చొచ్చుకుపోతోంది. అక్కడి గ్రామాల్లో ఆడపిల్లలకు బాల్యవివాహాలు అయితే వారికి 15 ఏళ్ల వయసు వచ్చేంత వరకు తమతోనే ఉంచుకుంటారు తల్లిదండ్రులు. అప్పటి వరకు అత్తారింట్లో చేయాల్సిన సేవలు, ఉండాల్సిన తీరు గురించి ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఆ తర్వాత విదాయి అనే మరో పార్టీ చేసుకుని ఆడపిల్లను వదిలించేసుకుంటారు. చదువు అనే ఆలోచనే మంచిది కాదు. తీరా చదివాక వేరే కులం వాడిని ఇష్టపడితే పరువేం గాను, పెళ్లితో తెగతెంపులు చేసుకుంటానని గొడవ చేస్తే వియ్యంకుల దగ్గర తలెత్తుకునేదెలా అందుకే బడి బంద్. చదువు గురించి గ్రామ పెద్దలతో మాట్లాడి చూద్దామని వెళితే రాళ్లతో తరిమి కొట్టించారు. తల్లిదండ్రులను కలిసి నచ్చజెబుతామంటే బహిష్కరణ బ్రహ్మాస్త్రాన్ని సంధించారు. తాగునీటి సమస్యకు పరిష్కారాలు, మహిళా ఆరోగ్యంపై సలహాలు, చేనేత కళల ప్రదర్శన, శిక్షణ శిబిరాలు అంటూ వేరే రూట్లో గ్రామాల్లోకి వెళ్లారు. అలా నెలల తరబడి గ్రామాల్లో అల్లుకుపోయి మహిళల్లో అభిమానాన్ని, పురుషుల్లో విశ్వాసాన్ని చూరగొన్నారు. ఎక్కడా చదువు అనే మాట రాకుండా జాగ్రత్తపడ్డారు. వీర్నీ తొలి గట్టు ఎక్కింది. ఇక తమ అసలు లక్ష్యమైన బాలికల విద్య. ఎలాగో 15 ఏళ్ల వయసు వచ్చే వరకు ఇళ్లల్లో ఖాళీగా ఉండటమెందుకు తమ శిక్షణ శిబిరాలకు పంపితే కుట్టు పని మరింత గట్టిగా చేస్తారని చెప్పి ఉన్నత పాఠశాల బోధన తెలీకుండానే మొదలెట్టేశారు. కానీ చాలా మంది బాలికలు పరీక్షలు తప్పారు. దీనికి కారణం.. గ్రామాల్లో అంతంత మాత్రం జ్ఞానం కలిగిన ఉపాధ్యాయుల తీరు. పండుగలని, పబ్బాలని మాటి మాటికీ అత్తారింటి ఆటంకాలు. పరిష్కారం.. నాణ్యమైన బోర్డింగ్ స్కూల్ విధానం. 2005లో తొలుత జోథ్‌పూర్ పట్టణంలోని ఓ హాస్టల్ ఏర్పాటు చేసి దగ్గరలోని ఓ ప్రైవేట్ స్కూల్లో చదివించారు. సొంతంగా స్కూల్‌ను ప్రారంభించారు. కేవలం బాల్యవివాహితలకే కాదు ఆ సుడిగుండంలో చిక్కే అవకాశం ఉన్న పిల్లల్నీ తెచ్చేశారు. పరీక్ష ఫలితాలు నమ్మశక్యం కాన్నట్టుగా మిగతా విద్యాసంస్థల కన్నా మెరుగ్గా వచ్చాయి. ఇక వారిని వీర్నీలుగా మార్చాల్సిన సమయం వచ్చింది. ఆటలు, నాటకాలు, హస్తకళ, చిత్రకళా పోటీలు, కథల ద్వారా బాలికల్లో సృజనను, ఉమ్మడితనాన్ని, స్నేహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, తమదంటూ ఓ ఆలోచనను ప్రేరేపించారు. వివిధ వేదికలతో బాల్యవివాహాలు ఎంత ఘోరమో, వాటి పర్యవసానాలు ఎలా ఉంటాయో తేలిగ్గా అర్థమయ్యేలా చేశారు. చిన్న వయస్సులోనే గర్భం దాల్చితే ఎంత ప్రాణాంతకమో తెలుసుకునేలా చేశారు. జీవితానికో లక్ష్యాన్ని ఏర్పరచారు. ప్రతి నెలా ఒక మానసికవేత్తనో, వృత్తి జీవిత నిపుణుల్లో తీసుకువచ్చి కౌన్సెలింగ్ చెప్పిస్తారు. వీర్నీ ఇన్‌స్టిట్యూట్‌కు వచ్చిన రెండు, మూడు ఏళ్లలోనే బాలికల్లో చాలా మార్పు కనిపించింది. పోలీసులు, న్యాయవాదులు, వైద్యులు, వైమానిక దళ ఉద్యోగులు, వ్యాపారవేత్తలుగా ఎదగాలని కలలు గనే రేపటి తరపు మహిళలుగా పరిణతి చెందారు. అప్పటి వరకు బరువుగా అనుకున్న ఆడపిల్లల్లో తల్లిదండ్రులకు బాధ్యతల్ని పంచుకోగలిగిన ఉద్యోగులు కనిపించారు. మరో మాట లేకుండా అత్తారింటి అడ్డంకులకు తావు ఇవ్వకుండా తిరిగి బోర్డింగ్ స్కూల్‌కు పంపించారు. చాలా మంది డిగ్రీలు పూర్తి చేశారు. ఉద్యోగాలు చేస్తూ కన్నవారికి ఆసరా అయ్యారు. అత్తారింటితో బంధాన్ని తెగతెంపులు చేసుకున్నామని ధైర్యంగా గ్రామ పెద్దల ముందు మాట్లాడారు. బలవంతం చేస్తే కేసులు పెడతామని హెచ్చరించారు. తమ మనసుకు నచ్చిన వారిని చేసుకుని వారిదంటూ జీవితాల్ని ప్రారంభించారు. కొందరు ఆ గ్రామాల్లో తొలిసారి పది పూర్తి చేసిన అమ్మాయిలు. కొందరు మిగతా బాలికలను బాల్యవివాహాల చెర నుంచి బయటపడేసిన వీర్నీలు.

తెల్లటి చుడీదార్‌లో ఆమె. మీగడ రంగు బట్టల్లో పాప. పాలు తాగుతూ తల్లి పొడవాటి వెంట్రుకలతో ఆడుకుంటోందా చిన్నారి. ఆ మధుర క్షణాలను ఆస్వాదిస్తూ... ముద్దులొలికే చిన్నారి ముంగురులను సవరిస్తోందామె. అత్యంత సహజమైన దృశ్యంగానే అనిపించినా... ఆమెకు మాత్రం అపురూపం. అనిర్వచనీయం. పదకొండేళ్ల కిందట ఓ మానవ మృగం వికృత చేష్టల కారణంగా తనకు ప్రాప్తించిన వికృతరూపం చూసుకుని ప్రాణాలే వదిలేద్దామనుకుంది. అలాంటిది తను కలలో కూడా ఊహించని విధంగా మనసుకు నచ్చిన వాడితో కలిసి జీవించే... అందమైన పాపకు తల్లి అయ్యే అవకాశం వరించిందామెను. చెప్పలేనంత బాధ, కొలచలేనన్ని కన్నీళ్లు, ఉదహరించలేనన్ని వెక్కిరింతలను దాటుకొని ... తనలాంటి వారి కోసం పనపడుతున్న లక్ష్మి జీవితంలోంచి నేర్చుకోవాల్సినవెన్నో...

నన్ను చూసి పాప భయపడుతుందనుకున్నా...

ఇరవై ఏడేళ్ల లక్ష్మిని పరిచయం చేయాలంటే ఎక్కడి నుంచి మొదలెట్టాలి? యాసిడ్ గాయానికి ముందు తర్వాత అని చెప్పుకుంటే సుళువుగా అర్థమౌతుందేమో! అప్పుడామెకు పదహారేళ్లు. ఢిల్లీలో చదువుకుంటోంది. ఆరోజు షాపింగ్‌కెళ్లింది. ఒకటి రెండు వస్తువులు తీసుకుంటే ఇంటికి వెళ్లిపోవచ్చనగా జరిగిందా ఘటన అనూహ్యంగా. చాలా సేపటి నుంచి వెంబడిస్తున్న ఓ వ్యక్తి తన మొహం మీద ఏదో పోసేశాడు. అది ద్రవం అని తెలుస్తోంది. మొదట చల్లగా తాకింది. ఆ తర్వాతే అది తన చర్మాన్ని, చర్మం కింది కండరాలను కాల్చేస్తున్న... మండుతున్న భావన! రెండు చేతులతో మొహం పట్టుకొని నేల మీద పడి దొర్లుతూ ఏడ్చింది. కేకలు పెట్టింది. సాయం చేయమని వేడుకొంది. అంతా అరణ్యరోదనే అయ్యింది. అప్పుడు ఓ ఆటోవాలా ముందుకు వచ్చి సెంట్రల్ ఢిల్లీలోని సఫ్దర్ జంగ్ ఆస్పత్రికి తీసుకెళ్లాడామెను. బాధతో మెలికలు తిరుగుతున్న ఆమెకు ... అప్పుడు తెలిసింది. అదీ నర్సుల మాటల ద్వారా. తనపై యాసిడ్ దాడి జరిగిందని. అలా రెండున్నర నెలలపాటు ఆస్పత్రిలో పడి వుంది. అన్ని రోజుల్లో ఒక్కసారి కూడా అద్దంలో తనను తాను చూసుకోలేకపోయింది. ఆఖరికి బాత్‌రూమ్‌లో సైతం అద్దం లేదక్కడ. తను తరచూమొహం కడుక్కోవడానికి నర్సులు ఇచ్చిన పింగాణీ గిన్నె నీళ్లలో తన ప్రతిబింబాన్ని మసక మసగ్గా చూసుకునేది. మొదటిసారి నర్సులు అద్దం ఇచ్చినప్పుడు భయంతో బిగుసుకుపోయింది.

యాసిడ్ కారణంగా కాలిపోయిన మొహంతో బతకడం కంటే చనిపోవడం మేలనుకుంది. వైద్యులు, కుటుంబ సభ్యులు ఇచ్చిన మద్దతుతో కోలుకున్నా ... తన చదువు, ఆటపాటలు అన్నీ ఆగిపోయాయి. అవన్నీ ప్రేమించానంటూ వెంటబడి వేధించి తను కాదన్నందుకు యాసిడ్ దాడితో ప్రతీకారం తీర్చుకున్న మూర్ఖుడి కారణంగానే. ఆ తర్వాత నాలుగేళ్లపాటు ఎన్నో ఆపరేషన్లు, చికిత్సలు. ప్రభుత్వ సాయం లేకపోవడంతో కుటుంబం అప్పుల పాలైంది. చివరిసారిగా 2009లో ఆపరేషన్ జరిగింది. ఆ తర్వాత మూడేళ్లకు గుండె జబ్బుతో తండ్రి చనిపోవడంతో కుటుంబం ఒక్కసారిగా నిరాధారంగా మిగిలిపోయింది. తనే కుటుంబాన్ని పోషించాలని నిశ్చయించుకుంది లక్ష్మి. 'ఎన్ని బాధలున్నా ఏదో ఒక రోజు తను ఊహించని విధంగా మంచి జరుగుతుందన్న' తన తండ్రి మాటల్నే మననం చేసుకుంటూ రోజును ప్రారంభిస్తుంది.

మొహమే ఆటంకమైంది

ఎన్నో చోట్లకెళ్లింది ఉద్యోగం కోసం. ఎన్నో ఇంటర్వ్యూలకు హాజరైంది. ఎక్కడకెళ్లినా మొహం మీది మచ్చలు, మరకలే ఆటంకమయ్యేవి. ఆ కసిలోంచి పుట్టిన పట్టుదలతో తనలాంటి వారికోసం ఏదైనా చేయాలన్న పంతం పట్టింది. యాసిడ్ అమ్మకంలో కొన్ని నియమనిబంధనలను పెట్టాలని సుప్రీం కోర్టు ముందు నిలబడింది. ఏళ్ల తరబడి చేసిన పోరాటం ఫలించి కోర్టు ఈమెకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆ తర్వాత అమెరికన్ ఎంబసీ నుంచి 'ఇంటర్నేషనల్ ఉమెన్ ఆఫ్ కరేజ్' అవార్డు అందుకుంది. న్యూస్ ఎక్స్‌ప్రెస్ చానల్‌లో సైతం తన గాథను, పోరాటాన్ని వినిపించింది. ఈ క్రమంలోనే ఆమెకు జర్నలిస్టు, సామాజిక కార్యకర్త అలోక్ దీక్షిత్‌తో పరిచయమైంది.

ప్రేమ...సహజీవనం...

ఆ పరిచయం ఆమె జీవితాన్నే మార్చివేసింది. అతనితో కలిసి ఓ స్వచ్ఛంద సంస్థలో పనిచేయనారంభించింది. అది యాసిడ్ దాడికి గురైన వారికి చల్లటి నీడనిచ్చేది. దేశ నలుమూలల నుంచి ఎందరో వస్తుంటారు ఆ గూటికి. అలక్‌తో పరిచయం స్నేహంగా, ప్రేమగా పరిణమించి... సహజీవనం దాకా వచ్చింది. ఇరువైపులా పెద్దలు అందుకు అంగీకరించలేదు. పెళ్లి లేకుండా నమ్మేదెలా అన్నారు. మనసుల్లో లేకుండా కాగితం ముక్కలతో కాపురాలు నిలవ్వన్నారు అలోక్ లక్ష్మి- లక్ష్మి తన తల్లికి అర్థమయ్యేలా చెప్పి అంగీకరింపచేసింది. మొదటిసారి తాము తల్లి దండ్రులం కాబోతున్నామని తెల్సినప్పుడు ఆ జంట పొందిన ఆనందం అంతా ఇంతా కాదు. మరీ ముఖ్యంగా లక్ష్మికైతే చెప్పలేనంత సంతోషం. అయితే ఆ బిడ్డ తనను, తన మొహాన్ని చూసి భయపడుతుం దేమోనని బెంగపెట్టుకుంది. పాప పుట్టి చేతుల్లోకి తీసుకున్నాక...రోజులు గడిచే కొద్దీ పాప తనకోసం పడుతున్న ఆరాటం చూశాక... ఆ భయం అంతా దూది పింజలా ఎగిరిపోయింది. తనకంటూ ఓ తోడు, ఓ బిడ్డ వుంటారని కలలో కూడా అనుకోనిది నిజమైందన్న విషయం గుర్తొచ్చిన ప్రతిసారీ తండ్రి చెప్పిన మాటలే మదిలో మెదులుతుంటాయి లక్ష్మికి. ఇప్పుడామె ప్రపంచం అంతా ఆ పాపే. అలోక్ అండతో తనలాంటి వారికోసం పోరాటమే జీవితంగా మలుచుకున్న ఆమె... ఎక్కడికి వెళ్లినా ఆ చిన్నారిని వెంట తీసుకెళ్తుంది. ప్రపంచంలో వున్న అన్ని రకాల స్వేచ్ఛలను, స్వతంత్రాలను తన బిడ్డకు ఇవ్వాలన్నది ఆమె కోరిక.

✦

చెంపకు చారడేసి కళ్లు..

వెన్నెల్లాంటి చల్లని నవ్వు..

బంగారు పోత పోసినట్లుండే

నిలువెత్తు విగ్రహం

ఒక ప్రసన్న వదనం.. ఒక ప్రచండ

వదనం .. ఒక ప్రళయ తాండవం

ఆమె ఎవరో ప్రత్యేకించి చెప్పవలసిన

పనిలేదు.

ఆమె పేరు కె ఆర్ విజయ.

కె ఆర్ విజయ తండ్రి రామచంద్రన్ ఆంధ్రప్రదేశ్‌కి చెందినవాడు. తల్లి కేరళకు చెందినవారు. బాల్యం పళని లోనే సాగింది. రామచంద్రన్ ఎం.కె రాధా డ్రామాల్లో నటిస్తూ వుండటం వలన కూతుర్ని ఎలాగైనా సినిమాల్లో నటింపజేయాలని విజయ చిన్నతనం నుండే ఆశపడ్డాడు. విజయ కూడా తండ్రి మాటని అనుసరించి ఆటా పాటా నేర్చుకొని చూడగానే అందరూ మెచ్చుకొనేలా తనను తాను తీర్చిదిద్దుకుంది. విజయ స్వతహాగా సిగ్గరి. మొహమాటస్తురాలు. తప్పులు ఎవరు చేసినా తానే శిక్షను వేసుకొనే నైజం కలది. ఒక వేళ తను తప్పు చేసినా బహిరంగంగా క్షమాపణకి కూడా వెనుకాడేది కాదు. తమిళ మలయాళ భాషల్లో ఆనాటి దర్శకుడు కె ఎస్ గోపాల కృష్ణన్ దృష్టిలో పడింది. మొట్టమొదటి సారిగా 'విజయ' కి కథానాయికగా అవకాశం ఇచ్చాడు. ఆ చిత్రం పేరే 'కర్పగం' తెలుగులో తోడు-నీడ.

ఈ తృప్తి చాలు

కర్పగం కాసుల వర్షం కురిపించింది!

తెలుగు తోడు-నీడ చిత్రంలో జమున పోషించిన పాత్ర కె ఆర్ విజయ చేసింది. ఎన్ టి ఆర్ కేరక్టర్ జెమినీ గణేషన్ చేశాడు. యస్వీఆర్ పాత్ర తమిళంలోనూ ఎస్వీఆరే చేశారు. ఆ సినిమా సంచలన విజయం సాధించి కాసుల వర్షం కురిపించింది. ఎంత గొప్ప విజయం సాధించిందంటే ఆ సినిమా విజయానికి గుర్తుగా 'కర్పగం' స్టూడియో నెలకొల్పారు. (వడపళని శారదా స్టూడియో పక్కన) ఈ సినిమా ప్రివ్యూ చూసిన ఎన్ టి రామారావు తన సరసన కథానాయికగా బావుంటుందని తమ్ముడు త్రివిక్రమ రావును పంపించాడు. బి సరోజకు కూడా బొట్టుపెట్టి అడ్వాన్సు ఇచ్చింది చిన్నాయనే.. ఆ తరువాత ఆమె వైభవం అందరికీ తెలిసిందే!

ఎన్.ఎ.టి సంస్థ జీవితాన్ని నేర్పింది

శ్రీకృష్ణ పాండవీయం చిత్రం అఖండ విజయం సాధించింది. ముందుగా రుక్మిణీ కళ్యాణం ఘట్టం అద్భుతంగా పండించింది. మెరుపు తీగలా మెరిసి పలువురు దర్శకుల దృష్టిని ఆకర్షించింది. తనకు తెలుగు నేర్పించి, సంభాషణలు ఎలా పలకాలో చెప్పించి.. తనమీద ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నారు ఎన్టీఆర్ బ్రదర్సు. సెట్‌లో ఎలా వుండాలి? పాత్ర పట్ల ఎటువంటి శ్రద్ధ తీసుకోవాలి పెద్ద నటుల్ని ఎలా గౌరవించాలి? ఇవన్నీ ఎన్టీఆర్ నేర్పించారు. కె ఆర్ విజయ తెలుగులో సినిమాలెన్ని చేసినా తొలి సినిమా అనుభవాల్ని మరిచిపోలేనంటుంది. తొలి సినిమాలో అటువంటి పునాది పడివుండక పోతే నా జీవితం ఏమైవుండేదో అని ఆత్మీయులతో అంటుంది.

క్షమాపణా పత్రం!

శ్రీకృష్ణ పాండవీయం చిత్రంలో నటిస్తుండగా ఒకరోజు షూటింగుకి గైర్హాజరైంది. అన్నయ్యతో

ఫోన్ తోమారా?

మిమ్మల్నే అడిగేదండి. ఈ రోజు మీరు మీ ఫోన్ తోమారా? అని అంటోంది జపాన్‌కు చెందిన ఓ ఫోన్ల తయారీ కంపెనీ. వాటర్ ప్రూఫే కాదు సబ్బుతో శుభ్రం చేసుకోవడానికి అనుకూలంగా ఓ స్మార్ట్‌ఫోన్‌ను ప్రవేశపెట్టింది మార్కెట్‌లోకి. మీ బాత్రూమ్ సీట్ కన్నా చేతిలోని ఫోన్‌పైనే ఎక్కువ క్రిములుంటాయని అనారోగ్యాలు వచ్చే అవకాశముందని అంటోంది. ఈ సమస్యను తీర్చేందుకే శుభ్రంగా తోమి పక్కన పెట్టుకునేలా ఫోన్‌ను డిజైన్ చేశామని చెబుతోంది. డిగ్నో రాఫ్ర్ అనే ఈ ఆండ్రాయిడ్ ఫోన్‌కు 13 ఎం.పి. మెయిన్ కెమెరా, 2 ఎం.పి. ఫ్రంట్ కెమెరా ఉన్నాయి. తడిచే అవకాశం ఉన్న స్పీకర్ లేకుండా స్క్రీన్‌పై వైబ్రేషన్స్ ద్వారా స్మార్ట్ సోనిక్ రిసీవర్ గుండా మాట వినేలా డిజైన్ చేశారు. ప్రస్తుతానికి జపాన్ వరకే అంటోందా కంపెనీ.

అందినట్టే అంది...

ఆస్ట్రియాలోని వియన్నా. ఓ కుర్రోడు నది వైపే అలా చూస్తుండగా కరెన్సీ నోట్ల కట్ట కనబడింది. వెంటనే నదిలోకి దూకేసి వాటిని ఒడ్డుకు తెగ ఆనందంతో మోసుకొచ్చాడు. అలా వచ్చాడో లేదో పోలీసులు పరుగెత్తుకు వచ్చేశారు. అయోమయానికి, భయానికి గురైన ఆ కుర్రాడు అసలు విషయం తెలుసుకుని అరెరె అనుకున్నాడు. ఎక్కడ ఈ కుర్రాడు ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్నా డోనని అటుగా వెళుతున్న కొందరు పోలీసుల్ని పిలిపించారు. ఆస్ట్రియా చట్టాల ప్రకారం ఇలా డబ్బు దొరికితే దాన్ని పోలీసులకు అప్పగించి 5 నుంచి 10 శాతం సొమ్మును అవార్డుగా తీసుకోవచ్చు. ఆ డబ్బు ఎవరిదో ఏడాది లోపు తేలక పోతే మొత్తం డబ్బంతా దొరికినవారికే చెందుతుంది.

వింత లోకం

మత్తుతో..చిత్తు..

చిన్ననాటే నాన్న పోయాడు. బాధ్యతంతా తన మీదే వేసుకుని ఇంటిని నడిపాడు. పెళ్లయ్యింది, పిల్లలూ కలిగారు. అప్పుడప్పుడే కాస్త గాడిన పడుతుందన్న సమయంలో అతడి జీవితం తలకిందులయ్యింది. చైనాకు చెందిన ట్రక్కు డ్రైవర్ ఝూంగ్ రూయికు 30 ఏళ్లే. కానీ జీవితాన్నంత కోల్పోయి ఇంట్లోనే ఖైదీలా బతుకుతున్నాడు. కష్టాల్ని కాసేపు పక్కన పెడదామని మద్యం తీసుకోవడం మొదలెట్టాడు. అది అలవాటుగా మారి రోజంతా మత్తులోనే జోగేవాడు. ఉద్యోగం కోల్పోయాడు. డబ్బు కోసం భిక్షమెత్తాడు. కాని దొరక్కుంటే ఇంట్లో వారిని చావబాది సొత్తంతా అమ్మేసేవాడు. అంతలా మత్తుకు చిత్తయిపోయాడు. ఝూంగ్‌ను చూసి భయపడిన భార్య పిల్లల్ని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఇక ఇంకా దిగజారిపోయింది అతడి పరిస్థితి. పదిమందితో మంచిగా మసలుతూ, సున్నితంగా ఉండే తన కొడుకు ఇలా రాక్షసుడు అయిపోవడానికి కారణం ఆ మద్యమే కావడంతో, దాని నుంచి బిడ్డను రక్షించుకోవడానికి తల్లి పెద్ద శిక్షే వేసింది. అతడి మెడకు బరువైన ఇనుప గొలుసులు వేసి బంధీని చేసింది. అంతకు ముందు అలవాటు మానుకుందామని శతథా ప్రయత్నించినా కుదరకపోవడంతో ఇదే సరైందని ఝూంగ్ కూడా భావించాడు. అలా ఆరునెలల నుండి ఒకే గదిలో ఖైదు అనుభవిస్తున్నాడు. మందు లేకుండా ఉండలేక చాలాసార్లు తల గోడకు కొట్టుకునేవాడు. ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించాడు. సమస్యకు ఇది పరిష్కారమో కాదో తల్లికి అర్థం కావడం లేదు.రీహాబిలిటేషన్ కేంద్రానికి పంపాలని ప్రయత్నిస్తున్నారు.

కత్తితో కటింగ్

స్పెయిన్‌కు చెందిన ఆల్బెర్టో ఓల్మెదో అనే హెయిర్ డ్రస్సర్ సెలూన్‌కు వెళ్లాలంటే ఒకటికి రెండు సార్లు ఆలోచించాల్సిందే. అక్కడ చిన్న కత్తెరలతో సున్నితంగా జుట్టు కత్తిరింపులు ఉండవు. ఓ పొడవాటి కత్తి దూస్తూ, 1300 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడిమితో ఉన్న బ్లో టార్చ్‌తో మంటపెడుతూ కటింగ్ చేస్తాడు. కోత తప్పిందనుకుంటే చేతికి లోహ పంజాల్ని తొడిగి టకటకలాడిస్తాడు. ఎందుకు ఈ విపరీతంరా బాబూ అంటే ఎయ్యో లెక్కలు చెబుతాడు. మామూలుగా కటింగ్‌ను ఓ వైపును పూర్తిచేసి మరో వైపు మొదలబెడతారు. అలా అయితే ఏదో ఒక వైపు కోత తేడాగా ఉంటుంది. అదే రెండు వైపులా సమానంగా ఉండాలంటే ఇలా తప్పదని అంటున్నాడు. ఈసారి మన సెలూన్ షాపులకు వెళ్లినపుడు ఇదిగో ఇక్కడ వదిలేశావ్, ఇక్కడ ఎక్కువుంది అంటూ పదిసార్లు విసిగిస్తే వీళ్లూ ఆల్బెర్టోలాగే పెద్ద కత్తులు వాడతారేమో మరి.

చెప్పిందనుకుని తమ్ముడూ, తమ్ముడితో చెప్పిందనుకుని అన్నయ్యా వూరుకున్నారు. ఏడున్నరకి షాట్ తీయాలి. ఎన్‌టిఆర్ గారు మేకప్‌తో సిద్ధంగా వున్నారు. త్రివిక్రమ రావుతో ఏమండీ! మా హీరోయిన్ గారెక్కడా? అనడిగారు. అంతే... షాక్ తిన్నాడు తమ్ముడు. అన్నదమ్ములిద్దరి మధ్యా మంచి అండర్‌స్టాండింగ్ వుంది. చిన్నాయన కారేసుకొని బైల్దేరి తిరిగి వచ్చి కె.ఆర్ విజయ సిద్ధమయ్యేలోగా ఎన్‌టిఆర్ దుర్యోధనుడి పాత్రలో సన్నివేశాన్ని పూర్తిచేశాడు. ఎన్‌టిఆర్ అద్భుతమైన నటనని చూసిన జయప్ప రెడ్డి గారు పరవశించిపోతున్నారు... అదీ ఎన్‌టిఆర్ గారి మూడ్. కె.ఆర్ విజయ భయపడుతూనే సెట్‌లోకి ప్రవేశించింది. నవ్వుతూ పలకరించి తర్వాత పనిలో నిమగ్నమైపోయారు. సాయంత్రానికి షూటింగు పేకప్ అయ్యింది. ఇక విజయకి ఒళ్లు కాలిపోతోంది. జ్వరంతో వణికిపోతోంది. ఎన్‌టిఆర్‌కి క్షమాపణలు చెప్పింది. ఆయన అవేం పట్టించుకోకుండా మనం సహ నటులం, మన మధ్య ఆత్మీయానురాగాలు వుండాలి గానీ సారీలూ క్షమాపణలూ వుండకూడదు. నిర్మాతగార్ని కలవండి అంటూ వెళ్లిపోయారు. తర్వాత చిన్నాయనని కలిసింది. జరిగింది చెప్పింది. నా మాతృ సంస్థగనుక అతిచనువు ప్రదర్శించాను మన్నించండి అని కోరుకుంది. చిన్నాయన ధర్మ సంకటంలో పడ్డాడు. కాసేపు ఆలోచించి "ఇట్సాల్‌రైట్ మీరు ఒక పనిచెయ్యండి... జరిగిందానికి క్షమాపణ చెబుతూ మీ స్వహస్తాల్తో సంతకం చేసి ఓ పత్రం ఇవ్వండి. అది ఫ్రేమ్ చేయించి మా కార్యాలయంలో పెట్టుకుంటాం. ఇది మీ భవిష్యత్తులో ఓ గుణపాఠాన్ని మిగులుస్తుంది. ఇంకెప్పుడూ షెడ్యూలూ కాల్షీట్లు పట్ల అజాగ్రత్తగా వుండరు. మా

సంస్థలో నటించబోయే వారికి కూడా ఒక హెచ్చరికగా నిలిచిపోతుంది' అన్నారు. కె.ఆర్ విజయ అలాగే చేసింది. ఆ ఫోటో ఇప్పటికీ వుంది. ఆమె గొప్పతనం ఏమిటంటే నేను తిన్న తొలిముద్ద నా మాతృ సంస్థని తలచుకుంటూ తింటాను, ఎన్.ఏ.టి బ్యానరు నాకు క్రమశిక్షణ నేర్పకపోయివుంటే నా జీవితం ఏమైయ్యేదో అంటూ కృతజ్ఞతని వ్యక్తపరుస్తుంది. ఆ నాటి నుంచి ఎప్పుడు షూటింగు జరిగినా, ఎవరున్నా, రాకపోయినా అరగంట ముందు కాస్ట్యూమ్స్ మేకప్‌తో సిద్ధంగా ఉంటుంది. ఒకసారి డేట్స్ కన్‌ఫార్మ్ చేసిన తరువాత.. ఆ రోజు షూటింగు కేన్సిలని తెలిసినా.... మరో ప్రొడ్యూసరు ఆ సమయాన్ని ఎడ్జస్ట్ చేయమని పాకులాడినా ఇవ్వదు. అంతటి కఠోరమైన నిర్ణయం తీసుకుంది.

కొన్ని ఆణిముత్యాలు

తమిళంలో కన్నగం, సరస్వతీ శపథం, నమ్మవీట్టు దైవం, ఇదయకమలం, తంగపతాకం, దీర్ఘసుమంగళి, పంచవర్ణకిలి, శ్రీకృష్ణపాండవీయం(ఎన్‌టిఆర్) పరమానందయ్య శిష్యుల కథ (ఎన్‌టిఆర్), సిపాయి చిన్నయ్య(ఎన్‌టిఆర్), శ్రీదేవి (హరనాధ్) మా ఇలవేల్పు (రామకృష్ణ) ఈ 'మాఇలవేలుపు' (తమిళంలో నమ్మవీటుదైవం) చిత్రాలతోనే అమ్మవారిగా తనను తాను ఆవిష్కరించుకుంది. ఆమెను అమ్మవారిగా చూసినవారు నిజంగా అమ్మవారేనని భక్తితో మొకరిల్లి నమస్కరించేవారు. చెన్నైలో కుండుత్తూరు.. మాంగాజ అమ్మవార్ల గుళ్లలో చాలాకాలం తొలి పూజలందుకునేది. ఆ సమయంలో ఆమెను చూడ్డానికి చాలామంది వచ్చేవారు. అలా భక్తులతో కిటకిటలాడిపోతుండేవి. అసాధ్యుడు(హీరోయిన్) భలేతమ్ముడులో నటనను ఎవరూ మరిచిపోలేరు.

ఒకనాటి వైభవం

చెన్నై టీనగర్ రామన్ వీధినెంబరు 4 ఇల్లు.. పెద్దలంకంత ఇల్లు. ఓ పెద్ద స్విమ్మింగ్ పూల్, హెలికాఫ్టర్, అరవై ఎకరాల కె ఆర్ విజయ గార్డెన్స్, నౌకర్లూ, చాకర్లూ నిత్యం పెళ్లి ఇల్లులా కళకళలాడుతుండేది. అటువంటి కె ఆర్ విజయ కారణాలు ఏవైనా కావచ్చు.... సర్వసాధారణమైన జీవితం గడపటం భర్త ఈ పుణ్యం కట్టుకున్నాడంటారు.

అవార్డులూ రివార్డులూ

1967లో ఒకసారి ఇరుమళర్గల్ చిత్రానికి గాను ఉత్తమనటిగా అవార్డులందుకుంది. 2004లో ఫిలింఫేర్ సంస్థ నుండి లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంటు అవార్డును అందుకుంది. ఇటీవల రాజరాజేశ్వరి, కుటుంబం వంటి తమిళ సీరియల్స్‌లో నటిస్తోంది. జీవితంలో చీకటివెలుగులు ప్రత్యక్షంగా అనుభవించగలిగింది. అపారమైన సంపద వచ్చినప్పుడు జీవితాన్ని అనుభవించింది. వచ్చేప్పుడు ఏం తీసుకొచ్చాం. రేపుపోయినప్పుడు ఏం తీసుకెళ్తాం? నన్నుచూడగానే 'అమ్మా' అని పలకరిస్తారు. ఇది అమ్మవారి అనుగ్రహం... నాపట్ల ప్రేక్షకులకు ఇప్పటికీ అదే ప్రేమానురాగాలు వున్నాయి. 'అమ్మా' అని పిలుపులోనే నేను అనంతమైన ఆనందాన్ని పొందగలుగుతున్నాను. ఈ జీవితానికీ తృప్తి చాలు! అంటోంది కె ఆర్ విజయ.

- ఇమంది రామారావు

నవ్వుల్ – పువ్వుల్

సీక్రెట్

ఒక పెద్దాయనని ఒక విలేఖరి ఇలా అడుగుతాడు.

విలేఖరి: మీకు 70 సంవత్సరాలు. ఇంకా మీరు మీ భార్యని డార్లింగ్, స్వీటీ అని పిలుస్తున్నారంటే మీరు గ్రేట్. మరి ఆ సీక్రెట్ చెపుతారా?

పెద్దాయన: నేను దాని పేరు మర్చిపోయా. అడగాలంటే భయమేసి అలా పిలుస్తాను.

పైకి తెచ్చిన బుక్

ఒక బుక్ సెల్లర్ నిర్వహించిన సర్వేలో ఒక మహిళను ఇలా అడుగుతాడు.

బుక్ సెల్లర్: మిమ్మల్ని జీవితంలో బాగా పైకి తెచ్చిన బుక్ ఏది.

మహిళ: మా వారి చెక్ బుక్...

పూలు

నాన్న: అల్లుడు గారు నిన్ను పువ్వుల్లో పెట్టి బాగా చూసుకుంటున్నారు కదా? అలా కంగారు పడుతూ వచ్చావేం?

కూతురు: ఆ పువ్వులు కొనడానికే డబ్బులు తెమ్మన్నారు నాన్నా!

ఇంగ్లీషు

పిల్లలను పరిచయం చేసుకుంటున్నాడు కొత్త మాస్టారు

మాస్టారు: ఒరేయ్ నీపేరు, మీ నాన్న పేరు చెప్పరా?

విద్యార్థి: నా పేరు చిట్టిబాబు, మా నాన్న పేరు సూర్య ప్రకాశ్ అండీ...

మాస్టారు: ఏదీ దాన్నే ఇంగ్లీషులో చెప్పు.

విద్యార్థి: నాపేరు లిటిల్ బాయ్, మానాన్న పేరు సన్‌లైట్ అండీ..

మాస్టారు: ఆ?????

వేలు

పేషెంట్: డాక్టర్ నేనెక్కడ ముట్టుకుంటే అక్కడ నొప్పిగా ఉంటుంది.

డాక్టర్: ఏమంటున్నావ్?

పేషెంట్: అవును డాక్టర్. నేను నా భుజం పట్టుకుంటే అక్కడ నొప్పిగా ఉంటుంది. మోకాలు టచ్ చేస్తే అక్కడా నొప్పిగా ఉంటుంది. నా నుదురు పట్టుకున్నప్పుడు కూడా చాలా ఇబ్బంది పెడుతుంది డాక్టర్.....

డాక్టర్: ఓకే... నాకిప్పుడు అర్థమైంది. నీ చేతి వేలు విరిగింది.

అందగత్తె

ఒక కాలేజీ అమ్మాయి తన స్నేహితురాలితో మాట్లాడుతోంది..

సరిత: మా అన్నయ్యని నగరంలో ఉన్న ఒక గొప్ప అందగత్తె పెండ్లి చేసుకుంటానని ప్రమాణం చేసిందట.

కవిత: నేను మీ అన్నయ్య ముఖమెప్పుడూ చూడలేదే!!

బిపి

హైదరాబాద్ బస్టాండులో ఒక ముసలావిడ వైజాగ్ వెళ్ళే బస్ ఎక్కింది. బాబు నేను నిద్రపోతానేమో విజయవాడలో నన్ను లేపుతావా అనడుగుతుంది.డ్రైవర్ సరే అంటాడు.

ముసలావాడ: విజయవాడ ఇంకా రాలేదా బాబు?

డ్రైవర్: అయ్యయ్యో మర్చిపోయాను విజయవాడు దాటేసి100 కిలో మీటర్లు వచ్చేసాం బామ్మగారు.

ముసలావిడ: దాంతో ముసలావిడ ఏడుపందుకుంది. తోటి ప్రయాణికులు ఆమె అవస్థ చూడలేక బస్ వెనక్కు తిప్పమంటారు. తీరా వెళ్లాక ఆ ముసలావిడ తన బాగ్‌లో నుండి రెండు మందు బిళ్లలు తీసి నోట్లో వేసుకుంటుంది.

ఏమీ లేదు బిడ్డా నాకు బిపి ఉంది. మా మనవడు విజయవాడ వెళ్ళగానే ఈ రెండు మందు బిళ్లలు వేసుకోమన్నాడు. నేను కూడా వైజాగ్ వెళ్ళాలి. ఇప్పుడు పోనివ్వు.

కాకి బంగారం

- షేక్ అహ్మద్ బాషా
9440650943



వేప మాను పల్లె. గత ఏడు సంవత్సరాలుగా అక్కడ వర్షాలు సరిగ్గా లేవు. కాలువలు ప్రవహించి, చెరువులు నిండి వ్యవసాయం మీద ఆధార పడి జీవించే రోజులు పోయాయి. చాలా మంది వలస కూలీలుగా పట్టణాలకు తరలి పోయారు. పనిచేసేందుకు శక్తి లేనివారు తప్ప. ఆ ముసలి వారికి కూడా గంజి దొరకడం కష్టమయ్యింది.

అంకయ్య మాత్రం ఊరు వదిలి పెట్టి పోలేదు. అతని వద్ద ఉన్న నాలుగు బర్రెలు ఇచ్చే పాలతో రోజులు నెట్టుకొస్తున్నాడు. రెండణాల పూరిల్లు, చుట్టూ ముళ్ల కంచె, ఒక మూల గేదెల కొట్టం, మరో మూల తడికెల స్నానాల గది. అతనికి ఒకే కూతురు, పేరు బంగారి. కూతురంటే అంకయ్యకు ప్రాణం. ఓ మూల అంకయ్య తండ్రి కుక్కి మంచం మీద కునుకు తీస్తున్నాడు. భార్య సాలమ్మ మధ్యాహ్నం మిగిలిన సంగటిని అంబలి చేసే ప్రయత్నంలో ఉంది. సాయంత్రం పడిన చినుకులకు వాతావరణం అయితే చల్ల బడింది కానీ ఇలాంటి వర్షాలకు వ్యవసాయం సాధ్యం కాదు. పచ్చ గడ్డి మొలిచి సస్యశ్యామలంగా కనబడుతుంది కానీ తాగేందుకు నీళ్లు కూడా కరువు. ఆ పచ్చ గడ్డే అంకయ్య ఎనుములకు ఆహారం. అవిచ్చే పాలే అతనికి ఆధారం.

పాత రేడియోలో పాటలు, ప్రకటనలు వినవస్తున్నాయి. అంకయ్య పరధ్యానంగా కూర్చుని ఉన్నాడు. అతనికెదురుగా బంగారి పాఠాలు చదువుకుంటూ పాటలు వింటోంది. ఆమె ఏడవ తరగతి చదువుతోంది. తెలివైన పిల్ల అని స్కూల్లో మంచి పేరు. ఇంతలో రేడియోలో ఒక ప్రకటన

"ఏమండీ, ఈ దీపావళికి నాకు ఏం బహుమతి ఇస్తారు." భార్య

"అరె, నువ్వు ఏం కావాలంటే అదే" భర్త

"మరి నాకు నెక్లెస్ చేయిస్తారా?

"నీకు బంగారు నెక్లెస్, అమ్మాయికి బంగారు వడ్డాణం,

కావాలంటే నువ్వు గాజులు కూడా తీసుకో"

"అంత డబ్బు మనకెక్కడిది?"

పిచ్చి దానా, లక్ష్మీ జువెలర్స్ వారు గ్రాముకు వంద రూపాయలు తగ్గించి అమ్ముతున్నారు. అదీకాక తరుగు కేవలం తొమ్మిది శాతం, తయారీ కూలీ కూడా లేదు."

"మరయితే రేపే వెళదాం." రేపెందుకు, ఇప్పుడే వెళదాం"

"లక్ష్మీ జువెలర్స్, గాంధీ రోడ్డు, ప్రతాప్ సినిమా హాలు ఎదురుగా"

ప్రకటన పూర్తయింది. ప్రతి ఐదు నిమిషాలకూ వచ్చే ఆ ప్రకటన బంగారిని అమితంగా ఆకర్షించింది.

"నాన్నా, బంగారం అంత చవకగా అమ్ముతున్నారా?"

"పిచ్చి పిల్లా రేడియోలో మాటలు విని మోసపోవద్దు, ఒక గ్రాము ధర 2700 రూపాయల పైనే"

"మరి అంతేసి నగలు కొనేద్దాం అంటున్నారు".

"వాళ్లకేమ్మా అలాగే అంటారు, కష్టపడకుండా వచ్చే సొమ్ముకదా".

"మరి మన దగ్గర కూడా నగలు ఉన్నాయి కదా నాన్నా".

అంకయ్య ఓ వెర్రి నవ్వు నవ్వాడు. "మన దగ్గర అసలు బంగారు నగలు ఎక్కడున్నాయమ్మా! అవన్నీ కాకి బంగారం, పెళ్లిళ్లకు, పేరంటాలకు పోతే మెడ బోసిగా ఉండకూడదని మీ అమ్మ సంత నుంచి తెచ్చుకుంది."

"మరి ఆ నగలు అంత బాగా మెరుస్తున్నాయి కదా నాన్నా"

"కాకి బంగారం అలాగే మెరుస్తుందమ్మా"

"మరి నిజమైన బంగారం ఎలా ఉంటుంది?"

అంకయ్య ఆ ప్రశ్నకు మనసులోనే జవాబు వెతుకుతున్నాడు. బాగా పండిన వరి పొలం కోసే దశలో మెరిసే రంగులా ఉంటుందని చెప్పలేదు. కారణం, గత పది సంవత్సరాలుగా ఆ చుట్టు పక్కల వర్షా భావం వల్ల వరినాట్లు వేసిన వారు లేరు.

పోనీ వేరుశనగ కాయలు భూమిలో బాగా ఊరి, చెట్టు పెరికే సమయంలో అందులోని పూలు, పండిన ఆకుల రంగు గురించి చెబుదామంటే చినిగి చెట్లు నీళ్ల లేక కాయలు కాయక, నల్లగా కమిలి మసిబారిన రైతు బ్రతుకులా కనబడుతుంటే ఎలా పోల్చగలడు. కనీసం తన కూతురు ఎర్రగా ఉండి ఉంటే నీలాగా ఉంటుదమ్మా అని చెప్పగలడు, కానీ బంగారి చామన ఛాయ. అంకయ్య బుర్ర గోక్కున్నాడు.

"నిజమైన బంగారంలో అంత మెరుపు లేకున్నా హుందాగా వుంటుందమ్మా" అంతకు మించి వర్ణించేందుకు అతనికి భాష చాలలేదు.

స్నానానికి వేడి నీళ్లు కాస్తున్న సాలమ్మ తండ్రీ కూతుళ్ల మాటలు వింటోంది.

"నాన్నా, నాకు నిజమైన బంగారు నగ ఒకటి చేయించవా?" ఎంతో ఆశతో అడిగింది. స్త్రీలకు బంగారంపై మోజు పసితనం నుంచే ఏర్పడుతుందా అని ఆలోచిస్తూ అంకయ్య ప్రేమగా కూతురి తల నిమిరి "అలాగే లేమ్మా, ఈ మారు వర్షాలు పడితే చెనిగిలో, కందులో వేసి పంట చేతికొస్తే అలాగే చేయిస్తా లేమ్మా" అతనికి వ్యవసాయం మీద ఇంకా ఆశ చనిపోలేదు. వాళ్ల మాటల్లో సాలమ్మ కల్పించుకుంది. "మావా, అత్త తొంగుటాల కమ్మలు వున్నాయి కదా, ఎలాగూ అవి మనం వేసుకోలేం, వాటికి మారుగా పిల్లకు కొత్త నగ కొందాం" అంది. తుంగటాలు అంటే పాత రోజుల్లో చెవులకు బరువుగా వేలాడుతూ చర్మం కూడా సాగేది. అవి పూర్వపు రోజుల్లో రైతు సిరిసంపదలకు నిదర్శనం.

"అవి చెరిపి మళ్లీ చేయించాలంటే మన దగ్గర డబ్బు ఎక్కడుంది. "అంకయ్య అడిగాడు."

"ఆ కమ్మలు వద్దంటే రెండు సవరాలుంటాయి. అవి అమ్మిన ధరకు మారుగా కొత్తవి కొందాం, మనకు ఖర్చు ఉండదు." సాలమ్మ ప్రతిపాదన అంకయ్యకు నచ్చింది.

"సరే రేపు వెళదాం" చెప్పాడు అంకయ్య.

మరుసటి రోజు వాళ్లకున్నంతలో మంచి బట్టలు వేసుకుని ముగ్గురూ బయలు దేరారు. రోడ్ల నిండా జనం. వాహనాలు, అప్పుడప్పుడూ పైన ఎగిరే

విమానాల మోత, ఎవరికీ క్షణం తీరిక లేనట్లు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. పట్టణంలో అదో బంగారు అంగడి. వీళ్ల వాలకం చూసి గూర్ఖా అద్దాల తలుపు తీయలేదు. అదే కారుల్లో దిగేవారయితే మర్యాదగా వంగి సలాములు చేస్తూ తలుపు తెరుస్తున్నాడు. అంకయ్యే తలుపును నెట్టి లోనికి వెళ్లాడు. పాత బంగారం అమ్మి, కొత్త కమ్మలు తీసుకోవాలని అతనికి సాదారంగా వివరణ ఇచ్చిన తర్వాత సాలమ్మ, బంగారిలను లోనికి రానిచ్చాడు. ఎసి హాల్లో అడుగు పెడుతూనే బంగారి ఒక్క క్షణం లోలోనే వణికింది. దీపాల వెలుగులో నగల తళతళలకు ముగ్గురూ నిచ్చేష్టులై నిలబడి పోయారు. ఆ షాపులో అనేక మంది కార్లల్లో, బైకుపై వచ్చి వంకాయలు, బెండకాయలు కొన్నట్లు నగలు కొనేస్తున్నారు. అందమైన ఒక అమ్మాయి దేవతలా వీళ్ళెదురుగా ప్రత్యక్షమై ఎంతో నమ్రతగా చిరునవ్వుతో వీళ్లను ఆహ్వానిస్తూ ఏంకావాలి అని అడిగింది. ఆమె చూపించే మర్యాదకు ఐస్ అయిపోయిన అంకయ్య తను వచ్చిన పని చెప్పాడు. ఆమె వాళ్లను ఒక కౌంటర్ వద్దకు తీసుకెళ్లింది. వీళ్లిచ్చిన పాత కమ్మలను పరీక్షించి, తూచి అవి 16 గ్రాములు వున్నాయని, తరుగు పోగా 14 1/2 గ్రాముల ధరకు సమాన విలువైన నగలు తీసుకోవచ్చుని చెప్పారు. ముందుగా ఎంపిక చేసుకోమని చెప్పింది. భార్య భర్తలు ఎలాంటి నగలు తీయాలో, వాటి ధరలు తమ కమ్మల ధరకు సరితూగుతాయా అని చూస్తున్నారు. ఇంతలో సాలమ్మ దూరంగా ఒక 'మానిక్విన్' మోడల్లో సన్నటి చైను భర్తకు చూపించింది. వీలైతే అది కొందామని ఆశపడింది. అంకయ్య ఆ బొమ్మ దగ్గరకు పోయి ఆ చైన్ ధర చూసి దడుసుకుని వెనుదిరిగాడు.

"దాని ధర ఒక లక్షా ఎనభై వేలే, దాంట్లో సన్నని వజ్రాలు ఉన్నాయని చెప్పాడు. అతని మొఖంలో కనబడిన కంగారును చూసి తల్లీకూతుళ్లు మనసారా నవ్వుకున్నారు. అంతసేపు చుట్టూ ఉన్న వాతావరణాన్ని గమనిస్తున్న బంగారి తండ్రిని అడిగింది.

"నాన్నా, వీళ్లంతా ఇన్నిన్ని బంగారు నగలు కొనేస్తున్నారే వారికి డబ్బులు ఎక్కడ నుంచి వస్తాయి"

"అమ్మా వీళ్లంతా గొప్ప ఉద్యోగులు, వ్యాపారులు. వాళ్లకు డబ్బుకు కొదవ లేదు".

"వీళ్ళంతా ఏం తింటారు నాన్న"

"మనలాగే వరి, కాయగూరలు, ఆకు కూరలు తింటారమ్మా".

"వారికి అవి ఎక్కడి నుండి వస్తాయి."

"మనలాంటి రైతులు పండించినవే తల్లీ, డబ్బు పెట్టి కొనుక్కుంటారు".

"అంటే వీరి బంగ్లాలు, కార్లు, విమానాలూ, కంప్యూటర్లూ ఇవేమీ తిండి గింజలు పుట్టించవుగా!"

"లేదమ్మా పొద్దున కాఫీ నుంచి రాత్రి భోజనం వరకు రైతుల మీదే ఆధార పడతారు"

"మరి ఇందరి కడుపులు నింపుతున్న రైతు మాత్రం కాకి బంగారం నగలు వేసుకుని తిండికి కూడా కష్టపడుతున్నాడు కదా నాన్నా"

అంకయ్య కూతురి విశ్లేషణకు బిత్తరపోయాడు. ఒక నిమిషం తర్వాత బంగారి చెప్పింది "నాన్నా నానమ్మ కమ్మలు అమ్మవద్దు. ఆమె గుర్తుకు వచ్చినపుడు చూసుకుంటాను. నాన్నా, మనుషుల్లో నిజమైన బంగారు మనుషులం మనమే , రైతులం. నిజం చెప్పాలంటే అందరి ఆకలి తీర్చే రైతే బంగారం కంటే ఎక్కువ. రైతే బంగారం అయినపుడు, ఇక ఈ బంగారం అంతా ఒక గింజ కూడా పండించలేని ఈ కాకి బంగారపు మనుషులకే ఉండనివ్వండి.. అంటూ ఆ షాపు బయటకు హుందాగా నడుస్తున్న బంగారి.. అంకయ్యకు నిజమైన బంగారంలా కనబడింది. ఇన్ని రోజులూ మనసులో పేరుకుపోయిన దిగులు, రైతు జీవితంలోని ఆత్మన్యూనత ఆ క్షణం పటాపంచలైంది. ఆమె వెనుకే భార్యా భర్తలు తలలు ఎత్తుకుని బయటకు నడిచారు. వారి నిష్క్రమణను అంగడివారూ, గూర్ఖా నోళ్ళు వెళ్ళబెట్టి చూస్తూ నిలుచున్నారు.

✦

ఆహ్వానం

కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధపడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక,హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

కవిత్వమ్

బాంబుల మోత...!

విరుచుకు పడదాం
ఉగ్రవాదంపై..
నెత్తురు మరిగిన
నర మేధంపై...
బతుకు ఎరగని బాల్యాలెన్నో
బంధం లేని సంబంధాలెన్నో
రాలుతున్నాయి రాక్షస కృతితో
బాంబుల మోతల విధ్వంసంతో
నిన్నొక చోట.....
నేడొక చోట.....
రేపింకో చోట...
జనాల్ని పేల్చే పర్వం
విద్వేషాన్ని పెంచే మర్మం
అదేనా మీ ధర్మం!
ఇదేనా మీ ధర్మ యుద్ధం!
చలి చీమలు ఐనా
మృగరాజు సింహాలైనా
ఆకలి వరకే యుద్ధం చేసె
అడవిని మొత్తం పదిలం చేసె
ఏమీ తెలవని..
ఏమిటో ఎరగని..
జన జీవనం నీ లక్ష్యం ఐతే
నడిచే దారులు రక్తపు మడుగులు కావా!
నీవు పేల్చిన గుండుకు తెలుసా
నీవు పెట్టిన డైనమైట్‌కు తెలుసా
ముసల్మాన్‌ను తాకరాదని
నీ తోడును చేరరాదని
జరిపిన దాడిలో...
మండే మంటలో..
మనుజులు మొత్తం
మృత్యు కౌగిలి చేరుతు ఉంటే
వారి ఆశల సౌధం కూలుతు ఉంటే
నీవు పొందే ఊరట ఏంటి?
నీ 'ధర్మ' యుద్ధపు ..
ఈ అధర్మం ఏంటి??

- మాతంగి దిలీప్ కుమార్
9848134139

మారాలి మన తత్వం

రహదారా... గోదారా...
వాననీరా... కన్నీరా...
తేలిపోతున్నవా శవాలు
వాలిపోతున్నవా పొలాలు
అనావృష్టిలో అతి వృష్టి ఘాతాలు
అశనిపాతాల్లా చినుకుల ఘాతుకాలు
ఇల్లు విడచి తట్టా బుట్టా తలపై పెట్టి
గట్టుకు చేరిన నీడ లేని బతుకులు
ఆగిపోయిన తోపుడు బండి చక్రాలు
కూలిపోయిన మట్టి గోడల ఆక్రందనలు
వేడివేడి పకోడీలు వెచ్చని దుప్పట్లు లేవు
ప్రకృతి విలయ తాండవానికి అడ్డుకట్టల్లేవు
శాశ్వత పరిష్కార సూచనల్లేవు
ఎవరేమి చేయగలరన్న నిరాశా నిస్పృహలు
తాత్కాలిక ఉపశమన చర్యలెన్నాళ్లు
దశాబ్దాలుగా పునరావృతమవుతున్న
హృదయ విదారక కథనాలు
గ్రీష్మానికి మునుపే ఉష్ణాలు
పిట్టల్లా రాలిపోయేరు బడుగులు
గుండె తరుక్కు పోయే చిత్రాలకు
శుభం పలకలేమూ
తల్లీ బిడ్డ మామ్మా తాతా
పచ్చగా నూరేళ్ళూ బతికేందుకు
అవినీతి వీడి అందరమూ కూడి
ఆనంద భాగ్యాలు కల్పించుకోవాలి
సమసమాజం విషాదరహితం కావాలి
నిస్వార్థతత్వమై మేలుకోవాలి

- షేక్ బషీరున్నీసా బేగం
9985193970

కేకో కేక

ప్లమ్ కేక్

కావాల్సినవి

గుడ్లు – 4
మైదా– 225 గ్రాములు
పంచదార – 225 గ్రాములు
పెరుగు – 225 గ్రాములు
కర్జూరం – అర కప్పు
కిస్‌మిస్‌లు – అర కప్పు
ఆరెంజ్ లెమన్ కాండీడ్ ఫ్రూట్ పౌడర్ – 1 టేబుల్ స్పూను
రమ్ము – 3 టేబుల్ స్పూన్లు (కావాల్సినవారు వాడుకోవచ్చు)
జీడి పప్పు – అర కప్పు
బాదం – పది
టూటీ ఫ్రూటీలు – 2 టేబుల్ స్పూన్లు
దాల్చిన చెక్క పొడి – అర టీ స్పూన్లు
బ్లాక్ జాక్ (కేక్ రంగు మారేందుకు వాడే పొడి) – 2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

రమ్ములో జీడిపప్పు, బాదం పప్పు, కిస్‌మిస్‌లు, కర్జూరం వేసి పది రోజుల ముందు నానబెట్టాలి. గుడ్డు సొనని బాగా గిలకొట్టాలి. ఇందులో మైదా, పెరుగు, పంచదార, ఆరెంజ్ లెమన్ కాండీడ్ ఫ్రూట్ పౌడర్, దాల్చిన చెక్క పొడి, బ్లాక్ జాక్ వేసి బాగా కలపాలి. దీన్ని బ్రెడ్ మౌల్డ్‌లో పెట్టి ఓవెన్‌లో 180 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద బేక్ చేయాలి. చివర్లో కేక్ క్రీముతో మనకి నచ్చిన డిజైన్‌లో అలంకరించుకోవాలి.

క్యారెట్ క్రిస్మస్ కేక్

కావాల్సినవి

కోడి గుడ్లు– రెండు, వెన్న – అర కప్పు
డెసికేటెడ్ కొబ్బరి – కప్పు
అక్రోట్ ముక్కలు– ముప్పావుకప్పు
ఎండు ద్రాక్ష – 1 కప్పు
క్యారెట్ తురుము – రెండున్నర కప్పులు
దాల్చిన చెక్క పొడి –1 టీ స్పూను
జాజి కాయ పొడి – 1 టీ స్పూను
అల్లం పొడి –1 టీ స్పూను
బ్రౌన్ షుగర్ (ముడి పంచదార) – 1 కప్పు
మైదా పిండి– ఒకటింపావు కప్పు
బేకింగ్ సోడా – 1 టీ స్పూను
ఆరెంజ్ జ్యూస్ – 2 టీ స్పూన్లు

తయారీ విధానం

ఓ గిన్నెలో మైదా, మసాలా పొడులు, బేకింగ్ సోడా, బ్రౌన్ షుగర్, వాల్‌నట్స్ ముక్కలు వేసి బాగా కలపాలి. మరో గిన్నెలో గుడ్లు వేసి గిలకొట్టాలి. విడిగా ఓ పాన్‌లో వెన్న వేసి కరిగిన తరవాత ఎండు ద్రాక్ష, క్యారెట్లు, ఆరెంజ్ జ్యూస్ వేసి కలిపి వెంటనే దించి మైదా మిశ్రమంలో వేసి కలపాలి. తరవాత గిలకొట్టిన గుడ్డు మిశ్రమాన్ని కూడా వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని నెయ్యి రాసిన బేకింగ్ టిన్‌లో వేసి సుమారు గంట సేపు ఓవెన్‌లో 150 డిగ్రీల సెంటీగ్రేడు దగ్గర బేక్ చేసుకోవాలి. చిన్న టూత్ పిక్‌తో ఉడికిందో లేదో చూసి బయటకు తీయాలి. బయటకు తీసిన తరువాత ఐసింగ్ చేసి సర్వ్ చేస్తే బాగుంటుంది.

డార్క్ క్రిస్మస్ పుడ్డింగ్

కావాల్సినవి

ఎండు ద్రాక్ష (లేత బంగారు రంగులో ఉండేవి) – 300 గ్రాములు
ఎండు ద్రాక్ష (ముదురు రంగులో ఉండేవి) – 300 గ్రాములు, మైదా – 120 గ్రాములు, ఉప్పు – 1 టీ స్పూను, అల్లంతురుము– 1 టీ స్పూను, జాజి కాయ పొడి – 1 టీ స్పూను, దాల్చిన చెక్క పొడి – 1 టీ స్పూను, లవంగాల పొడి – 1 టీ స్పూను, మార్గరిన్ (వెన్న) తురుము – 240 గ్రాములు
తాజా బ్రెడ్ ముక్కలు – 120 గ్రాములు, పంచదార లేదా బెల్లం – 120 గ్రాములు
చెర్రీలు – 60 గ్రాములు
ఆరెంజ్ తొక్కతురుము –2 టేబుల్ స్పూన్లు, నిమ్మ తొక్కల తురుము – టేబుల్ స్పూను, ఆరెంజ్ జ్యూస్ – అర కప్పు, కోడి గుడ్లు – రెండు, వెనీలా ఎసెన్స్ – 1 టీ స్పూను

తయారుచేసే విధానం

ఎండు ద్రాక్షను బాగా కడిగి ఆరనివ్వాలి. పిండిని జల్లించి ఓ గిన్నెలో వేసి అందులో ఉప్పు, మసాలా పొడులు కలపాలి. తరవాత బ్రెడ్ ముక్కలు, పంచదార, మార్గరిన్ వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఎండు ద్రాక్ష, చెర్రీలు, బాదం ఆరెంజ్, నిమ్మ తొక్కల తురుము వేసి కలపాలి. విడిగా మరో గిన్నెలో ఆరెంజ్ రసం, గుడ్డు సొన, వెనీలా ఎసెన్స్ వేసి బాగా కలిపి ఎండు ద్రాక్ష మిశ్రమంలో కలపాలి. ఈ మిశ్రమం మొత్తాన్నీ నెయ్యి రాసిన అంచు గిన్నెలో వేసి మంద పాటి బట్టను గిన్నె పైన కప్పి అది విడిపోకుండా దారంతో కట్టేయాలి. ఇప్పుడు ఈ గిన్నెను ప్రెజర్ కుక్కర్‌లో పెట్టి మూడు విజిల్స్ వచ్చేవరకూ ఉడికించాలి. తరవాత బయటకు తీసి బట్ట తీసి మూత పెట్టి ఉంచాలి. తినే ముందు మరోసారి ఆవిరి మీద వేడి చేసి సర్వ్ చేస్తే సరి!



బొమ్మ పూరించండి

ఇక్కడ ఆరుగురి తలలున్నాయి. కాకపోతే ఎవ్వరికీ కళ్లు, ముక్కు, మూతి లేవు. వాటిని మీరు వేయాలి.



పదాల పుష్పం

ఈ పువ్వు లోపల అక్షరాలన్నీ ఒక కుప్ప పోసినట్టున్నాయి కదూ. వీటిలో 17 పదాలు దాక్కున్నాయి. వాటిని గుర్తించండి.



బుజ్జి స్టార్

అప్పుడు నేను 'చంటి'ని. ఇప్పుడు పెద్ద హీరోని. ఇంతకీ నేనెవర్నో చెప్పుకోండి?

పొడుపు కథ

కాళ్లు లేవు గానీ నడుస్తుంది.
కళ్లు లేవు గానీ ఏడుస్తుంది?

జవాబు: మేఘం

తేడాలు గుర్తించండి

ఈ రెండు చిత్రాల మధ్య 12 తేడాలు వున్నాయి. అవేంటో గుర్తించి సున్నా చుట్టేయాలి.



నీడ బొమ్మ

రాత్రి పూట. గదిలో లైట్ తీసేసి... క్యాండిల్ వెలిగించండి. మీ చేతి వేళ్లను ఇదిగో ఇలా ... ఈ బొమ్మలోలాగా పెట్టండి. వాటి నీడ గోడ మీద పడాలి. ఆ నీడ ఓ జంతువును పోలి వుంటుంది. అదేవరో చెప్పుకోండి.



జవాబు: కుందేలు

అగ్గిపుల్ల ఇల్లు



పది అగ్గిపుల్లలతో రెండు ఆకారాలు చేసి మీ ముందుంచారు. వీటిలోంచి ఆరింటిని కదిల్చి ఇంటిని తయారుచేయాలి.

జవాబు



అయ్యారే .. *సయాలి!*

ప్రతి స్కూల్లోనూ ఆటల పోటీలు జరుగుతుంటాయి. అప్పుడప్పుడు స్కూళ్ల మధ్య కూడా పోటీలు పెడుతుంటారు. అలా ముంబైలో ఇటీవల జరిగాయి. అండర్ 17 క్యాటగిరీలో పరుగుపందెంలో బంగారు పతకం సాధించిన అమ్మాయిని చూసిన వారిలో ఎన్ని ప్రశ్నలు మొలకెత్తాయని! 'ఈ అమ్మాయా గోల్డ్ మెడల్ సంపాదించింది?! కాళ్లకు బూట్లు కూడా లేవు. ఈ పిల్ల ఎలా గెలిచింది?!' అని ఒకటే ఆశ్చర్యం కనబరిచారు. ఆ బుల్లి పరుగుల రాణి పేరు సయాలి. వాళ్ల నాన్న చెప్పులు కుట్టి కుటుంబాన్ని పోషిస్తుంటాడు. నెల మొత్తం కష్టపడితే 3 వేల నుంచి 10 వేల రూపాయల వరకు సంపాదిస్తాడు. ఆ డబ్బులు తన ఇద్దరు కుమార్తెల స్కూలు ఫీజులకే సరిపోవంట. అలాంటి కుటుంబానికి చెందిన సయాలి పరుగు పందెంలో గోల్డ్ మెడల్ సాధించడమంటే చిన్న విషయమా!

అయితే ఆ విజయంలో సయాలి పట్టుదల, కృషి, సాధన గురించి తప్పక చెప్పుకోవాలి. తొమ్మిదవ తరగతి చదివే సయాలి ప్రతి రోజూ పోలీస్ గ్రౌండ్‌లో పరుగు సాధన చేస్తుంది. అయితే ... అదేమో మట్టి రోడ్డు. ఆమె పోటీ పడిందేమో సింథటిక్ ట్రాక్ మీద. ఎండకు కాలిపోతుంటుందా ట్రాక్. కాళ్లకు బూట్లు కూడా లేకుండా ఒట్టి కాళ్లతో పోటీకి దిగింది. ఆ సమయంలో ఆమె మనసులో వున్నది ఒకటే. 'ఎలాగోలా రేస్ ముగించాలి'. తన గురంతా లక్ష్యాన్ని చేరుకోవడం మీదే. అంతకుమించి పతకం మీద లేదు. తీరా చూస్తే 12:27.8 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని విజేతగా నిల్చి అందర్నీ ఆశ్చర్యపరచింది.

నిజానికి సయాలీ పతకం గెల్చుకున్న ఆటలపోటీలను కళ్లారా చూడాలని ఆమె తండ్రి ఎంతగానో ఆశపడ్డాడు. కానీ పని ఒత్తిడిలో వీలుకాలేదు. ఎప్పటికైనా తన ముద్దుల కూతురు దేశం తరపున పోటీల్లో పాల్గొనాలని ఆయన కోరిక. తీరుతుందని ఆశిద్దాం.

✦

ప్రత్యేకం

నవ్వుల బుడ్డోడు

"ఈ రోజూ బడికి వెళ్లాల్సిందేనా!! రాట్.."

"ఏంట్రోయ్ ఏంటీ నస?"

"అదేం లేదమ్మా" అంటూ బడికి నీరసంగా నడక. సరిగ్గా ఇలాగే ఆ రోజు మొదలైందో లేదో తెలీదు గానీ తులసీ దాస్ జీవితంలో అదే పెద్ద మలుపైంది. బడి ఇంకాస్త దూరంలో ఉందనగా చిరాగ్గా ఫేస్ పెట్టి కాస్త టర్నింగ్ ఇచ్చుకునేసరికి రంగు రంగుల సర్కస్ వాల్‌పోస్టర్ తటాలున ఆపేసింది. అమ్మో అంత పెద్ద ఏనుగులు చిన్న బ్యారెల్‌ను తిప్పుతూ నడుస్తున్నాయని నోరు బారవడం.. వామ్మో అన్ని సింహాలతో ఓ మనిషి అగ్ని చక్రంలోంచి దూకిస్తున్నాడే అన్న భయం.. వీళ్లెవరూ! ఇంత పొట్టిగా.. భలే గమ్మత్తుగా ఉన్నారే.. అయ్ వారి ముక్కేంటి అలా ఎర్రగా పండులా ఉందనే ఆనందం.. తులసీదాస్‌కు ఒక్క పోస్టర్‌లో వంద అతిశయాలు, పది భావోద్వేగాలు గిరగిర తిరిగాయి. అంతే స్కూల్ బ్యాగ్‌ను ఒక్క చూపు చూసి పోస్టర్‌ను ఒక్క చూపు చూసి సాయంత్రానికల్లా 'ది గ్రేట్ బాంబే సర్కస్' క్యాంపు దగ్గర క్యాంపు వేశాడు. సర్కస్ జరుగుతున్న రోజులన్నీ భలే పండగ. బడి కంటే టెంటే ఆసక్తి కలిగించింది. ఇంట్లో వాళ్లు వద్దన్నా వినకుండా సర్కస్‌లో చేరిపోయాడు. అప్పుడు తులసీ దాస్ చదువు ఏడో తరగతి, వయసు 13 ఏళ్లు. బీహార్‌లోని తన సొంతూరు ఛాప్రాలో ఆ సర్కస్ షోను చూసి మనసు పెట్టేసుకున్నాడు. అప్పటి యజమానులు, నిర్వాహకులు అయిన బాలగోపాల్, బాబూరావ్ కాదమ్‌ల ఆప్యాయత మరింతగా లాగేసింది సర్కస్‌లోకి. సర్కస్ ట్రూప్‌తో కలిసి సాగిపోతూ ఊరికి వీడ్కోలు చెప్పాడు. తల్లిదండ్రులకు భారంగానే చేయి ఊపాడు. ఆరు నెలలు గడిచాయి. ఒళ్లు విరిచే కసరత్తులు, ఏక్రోబేటిక్ సాధన. అమ్మానాన్నలూ తెగ గుర్తొస్తున్నారు. అయినా నవ్వుల రేడుగా మారేందుకు మనసు తీపి తీస్తుందే తప్పితే మరో ఊసంటూ లేదు. కలకత్తాలో వ్యాపారం చేస్తున్న తండ్రి మరణవార్త అందింది. అన్నలొచ్చి ఇంటికి వెంటబెట్టుకెళ్లారు. విషాద కాలం గడిచింది. ఇంటి భారం పెరిగింది. రెంటికీ సమాధానం నవ్వులు అమ్ముకోవడమే. మళ్లీ సర్కస్‌కు వెళ్లిపోయాడు.

ఆల్ టైమ్ గ్రేట్

విదూషకుడిగా మంచి పేరొచ్చింది. ఒకప్పుడు కడుపులో తిప్పేసే జంతువుల వాసన ఇప్పుడు సొంత గంధం అయ్యింది. ఇద్దరికి జాగా ఇచ్చే టెంటే సర్వ లోకం అయ్యింది. దుస్తులు, మేకప్ కిట్లుండే రెండు ఇనుప పెట్టెలే యావదాస్తిగా సమకూరాయి. ఇక అప్పటి నుంచి జోకర్ బుడ్డోడిగా చాలా ఎదిగిపోయాడు. అంతమంది క్లౌన్‌లలోను తులసీదాస్‌ను గుర్తుపట్టే అభిమానులున్నారు. చార్లీచాప్లిన్ లెక్క తనకంటూ ఓ ప్రత్యేక శైలితో విదూషకులకు ఓ పాఠ్యగ్రంథంగా మారాడు. షోలో ఉన్నట్టుండి బాధలో ఉబికి వచ్చే కన్నీటిని కూడా జనం చూసి చప్పట్లు కొట్టడం, పొట్టలు పగిలేలా నవ్వుకోవడం చూసి ఆ నవ్వుల అంటువ్యాధిని అంటించేసుకున్నాడు. దేశమంతా చుట్టొచ్చాడు. జీవితాలన్నెంటినో చదివొచ్చాడు. తెలుసుకున్నదొక్కటే నవ్వుతూ, నవ్విస్తూ పదికాలాలు బతికాననే సంతృప్తి చాలని. ఏకంగా యాభై ఏళ్ల కెరీర్‌ను పూర్తి చేసుకుని 'ది గ్రేట్ బాంబే సర్కస్'లో ఆల్ టైమ్ గ్రేట్‌గా నిలిచిపోయాడు. నిర్వాహకులు, యజమానులు మారారు కానీ తులసీదాస్ కనిపించినపుడు వచ్చే కేరింతలు మాత్రం మారలేదు. బాతులా వడివడిగా నడిచొచ్చేది ఓ ముదుసలి అని కనిపెట్టేందుకు ప్రేక్షకుడికి నవ్వొపేందుకు తీరికెక్కడిచ్చాడు మరి.. ఏడాదికి రెండు సార్లు తల్లిని చూసేందుకు వెళ్లే తులసీదాస్‌కు వివాహం కాలేదు. భార్యపిల్లల లోటు బాగా అనిపిస్తోంది మంచి పిల్లనుంటే చూడండని అంటూ వేళాకోళమాడుతున్నాడేనని నవ్వుకుంటారు కానీ నిజంగా కోల్పోయింది నవ్వుతూనే చెప్పాడని గ్రహించలేనంతగా నవ్వులతో నమ్మిస్తాడు. అయినా ఇంత పెద్ద కుటుంబం తనకొక్కడికే ఉందని సింహాల్ని, ఒంటెల్ని, ఏనుగుల్ని, తోటి ట్రూప్‌ను చూపిస్తాడు. ప్రేక్షకుల్ని మైమరిపించారని గర్వపడిన రోజు గురించి చెప్పమంటే 'ఆ గర్వాలెందుకులెండి! ఆపదలో నా సర్కస్ కుటుంబాన్ని ఆదుకున్నవారి గురించి చెబుతా'నంటూ ఓ ఘటన నెమర వేసుకుంటాడు. పంజాబ్‌లో సర్కస్ క్యాంపు వేసినపుడు వరదలు ముంచుకొచ్చాయి. 22 ఏనుగులు, 12 ఒంటెలు, 30 గుర్రాలు వీటికి తోడు సింహాలు. వాటినెలా బతికించుకునేది అని దిగాలు పడుతుండగా గ్రామస్తులు పెద్ద ఎత్తున వచ్చి మొత్తం క్యాంపునంతా ఓ మైదానానికి మార్చి ప్రాణాల్ని కాపాడారని గుర్తుచేసుకుంటాడు. నేతితో చేసిన కూర, రొట్టెలతో పసందైన విందుతో ఆ వరదల సమయంలో కడుపు నింపడమే కాకుండా జంతువులకూ భారీ ఆహారాన్ని ఏర్పాటు చేశారని గొప్పగా చెబుతాడు. సింహాల కోసం ఉన్న మేకలన్నింటినీ ఇచ్చేసిన కుటుంబాల గురించి ప్రత్యేకంగా వివరిస్తాడు. ఆ గ్రామస్తుల ఆదరణ, మానవతే ఇన్నేళ్లు ఈ వృత్తికి కట్టుబడేలా చేసిందని, గుండాగే లోగా నవ్వొగనివ్వనని తులసీదాస్ చౌదరి టోపీ సరిచేసుకుంటూ అంటాడు. మాట కలిపిన వారికి వీడ్కోలు చెబుతూ తర్వాతి ప్రదర్శనకు చేతికర్ర అందుకుంటాడు.

పుస్తకాల్లోని పాఠ్యాంశం కన్నా ఓ జీవిత పాఠం ఆకట్టుకుంది. బడికి నిక్కర్లు వేసే వయసులోనే ఎలా కట్టిపడేసిందో తెలీదు గానీ ఊత కర్ర పట్టే వయసు వచ్చే నాటికి కూడా ముఖానికి రంగు వేయిస్తోంది. ముక్కుకు ఎర్ర బంతి పెట్టిస్తోంది, చుక్కల బట్టలు వేసుకుని జోకర్ వేషం వేయిస్తోంది. కన్నీటిని దిగమింగి పదిమందిని నవ్వుల్లో ముంచేసే ఆ బతుకుదెరువే జీవిత పాఠం అయిపోయింది తులసీదాస్ చౌదరికి. యాభై వసంతాల కెరీర్‌లో విరబూయించిన ఆనంద పుష్పాలెన్నో.. విరగ్గాయించిన నవ్వు ఫలాలెన్నో.

✦

బొమ్మకూ ప్రాణముంది

ఈ బొమ్మలకు భావోద్వేగాలుంటాయ్. ప్రాణం పోయండంటూ దీనంగా చూస్తుంటాయ్. పోర్సిలిన్‌లో బంధీలయ్యామని కన్నీరొలికిస్తాయ్. రష్యన్-కెనెడియన్ కళాకారిణి మరీనా బిచ్కొవా ముద్దుగుమ్మల బొమ్మలు. వాంకోవర్‌లోని ఎమిలీ కార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్ అండ్ డిజైన్ పూర్వ విద్యార్థి అయిన మరీనా స్త్రీ సంబంధిత సమస్యల్ని అందమైన బొమ్మల్లో కళ్లకు కడుతోంది. బ్రెస్ట్ క్యాన్సర్ వంటి ప్రాణాంతక సమస్యలు, నెక్రోఫీలియా, స్టాక్‌హోమ్ సిండ్రోమ్ వంటి మానసిక సమస్యలపై కొన్ని బొమ్మల కొలువులు కూడా ఏర్పాటు చేసింది. వీటిని తదేకంగా చూస్తే ఏదో లోతైన ఆవేదన హృదయాన్ని తాకుతుంది. నీరుదేరిన కన్నులతో అవి తెలీకుండానే మన కంటిని తడిచేస్తాయి. విషాదం, కుంగుబాటు, దాస్యం, ప్రాణాంతక అనారోగ్యం వంటి పలు సమస్యలకు రూపమిస్తూ పోర్సిలిన్ యువరాణి బొమ్మల్ని డిజైన్ చేస్తుంది మరీనా. అయితే ఈ ఆవేదనకు ఆభరణాలకు సంబంధం ఉండదు. పట్టు పరికిణీల్లో, వజ్రపు కిరీటాల్లో దేవేరిలా కొలువుదీరే ఆ బొమ్మల బాధంతా ప్రస్ఫుటంగా పరికించగలిగేది వాటి మోముల్లోనే. కళకళలాడే వాటి ఆహార్యం ఇంత ఆవేదనను దాయలేవు. జానపదాల్లో, కథల్లో చెప్పుకున్న యువరాణి పాత్రలే ప్రేరణగా బొమ్మల థీమ్‌లుంటాయి. ఒక్కో బొమ్మకు 135 నుంచి 350 గంటలు సమయం పడుతుంది. గాజు కళ్ల బదులు సునిశితంగా పెయింట్ వేసి కన్నీరొలుకుతున్న ఎఫెక్ట్ తీసుకువస్తుంది. ఈ బొమ్మల్ని లక్షలు పెట్టి కొనుక్కుంటున్నారు.

మరీనా

ఎన్ని రంగుల బియ్యమో...

మనం రోజూ అన్నం తింటున్నాం. రోజూ తెల్లన్నమే. అందులో తినే రుచులు, వాటి రంగులే మారుతుంటాయి. అయితే అన్నం కూడా రంగు రంగుల్లో వండుకోవచ్చని తెల్సా! తెలుపు, ఎరుపు, నలుపు, నిండు నీలం ..ఇలా అన్నమాట. ఈ మధ్యే బ్రౌన్ రైస్ (ముడి బియ్యం) వాడుతున్నాం. ఎర్ర బియ్యం కూడా కొందరికి తెలిసే వుండొచ్చు. నల్ల బియ్యం కూడా వాడుతున్నారు కొన్ని దేశాల వాళ్లు. అనేక ఆసియా దేశాలతో పాటు మన దేశంలోనూ నల్లబియ్యాన్ని పండిస్తున్నారు. మణిపూర్‌లో వీటి వాడకం ఎక్కువ. వీటిని 'ఫర్‌బిడెన్ రైస్' అని కూడా అంటుంటారు. ఒకప్పుడు చైనా రాజులకు మాత్రమే వీటిని వండిపెట్టేవారు. అందుకే వీటికా పేరు వచ్చింది. ముదురు వంకాయ వర్ణంలో వుండే బియ్యం కూడా వున్నాయి. ఇతర రకాలతో పోలిస్తే బ్లాక్ రైస్‌లో పోషకాలు మెండు. ఐరన్ మరీ అధికం. దంపుడు బియ్యంలోలాగా పీచూ ఎక్కువే. నలుపు, వంకాయ, ఎరుపు...ఇలా ఏ రంగు బియ్యంలోనైనా ఆంథోసైనిన్ అనే వర్ణద్రవం ఎక్కువగా వుండడమే ఆయా రంగులకు కారణం. అన్నిటికన్నా నలుపు బియ్యంలో క్యాలరీలు ఎక్కువ. పీచు కూడా ఎక్కువే. కొద్దిగా తినగానే కడుపు నిండిపోతుంది. బరువు తగ్గాలనుకునేవారికి ఇది మంచి ఆహారం. కేరళలో పండించే ఎరుపు రంగు బియ్యంలోనూ ఔషధగుణాలు ఎక్కువే. ఆయుర్వేదంలో వీటిని శాస్తిక బియ్యం అంటారు. వీటిలోనే రెడ్ ఈస్ట్ రైస్ బియ్యం ప్రత్యేకమైనవి. వీటిని కొలెస్ట్రాల్ తగ్గించడానికి తింటుంటారు. సహజంగా పండించే బియ్యంలోనూ ఎన్నో వర్ణాలు, మరెన్నో పోషకాలు. అందుకే రోజూ తెల్ల బియ్యమే తినకుండా రంగు రంగుల బియ్యాలను రుచి చూడొచ్చు.

★